PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 331 | విజయవాడ, గురువారం 4 జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 4 July 2024 | Rs

2025 ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల

- మార్చి 1న భారత్-పాక్ మ్యాచ్
- ఐసిసి ఆమోదానికి డ్రాఫ్ట్ కాపీ



8

నామినేషన్లు ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యుల కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు టిడిపి కూటమి అభ్యర్థులు సి రామచంద్రయ్య, పిడుగు హరి ప్రసాద్ మంగళవారం దాఖలు చేసిన నామినేషన్లు ఆమోదం పొందాయి. బుధవారం జరిగిన స్క్రూట్నీలో తమ అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు ఆయా పార్టీలు వెల్లడిం చాయి. వైసిపి నామినేషన్ వేయకపోవడంతో రెండు స్థానాలను టిడిపి కూటమి గెలుపు ఏకపక్షమే. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 5 వరకు ఉండటంతో గడువు ముగిసిన అనంతరం అధికారికంగా ఆర్ఓ ప్రకటించే అవకాశం ఉంది. స్క్రూట్నీ కార్యక్రమానికి జనసేన నుంచి నామినేషన్ దాఖలు చేసిన పి హరి ప్రసాద్, పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్ ఈవన సాంబశివ ప్రతాప్ హాజరయ్యారు. టిడిపి నుంచి సురేష్ కోనేరు హాజరయ్యారు.

భోలే బాబా పరార్!

- ఎఫ్ఐఆర్‌లో కానరాని పేరు
- నిర్వాహకుల పేర్లు మాత్రమే నమోదు
- 121కు చేరినహత్రాస్ తొక్కిసలాట మృతుల సంఖ్య



హత్రాస్ : హత్రాస్ ఘటనలో మరణించిన వారి సంఖ్య 121కి పెరిగింది. మతపరమైన ప్రార్థనా కార్యక్రమాన్ని నిర్వహించిన నారాయణ్ సకాల్ హరి అలియాస్ భోలే బాబా పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సత్సంగ్ ముఖ్య నిర్వాహకుడు దేవ ప్రకాశ్ మధుకర్, ఇతర గుర్తు తెలియని నిర్వాహకులపై మాత్రమే కేసు నమోదైంది. ప్రార్థనా సమావేశానికి ఎనభై వేల మందికి అనుమతి ఇస్తే రెండున్నర లక్షల మంది వచ్చారని పోలీసులు తెలిపారు. భోలే బాబా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మొయిన్‌పురిలో భోలే బాబాకు చెందిన రామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్టులో సోదాలు నిర్వహించామని, అక్కడ ఆయన కన్పించలేదని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ అధికారులు ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకొచ్చి పరిసరాలలో గాలించారు. తనను తాను గురువుగా చెప్పుకునే భోలే బాబా ఆశీస్సులు పొందేందుకు, ఆయన పాదధూళిని స్వీకరించి నుదుట రాసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎగబడడంతో తొక్కిసలాట జరిగిందని అధికారుల ఆంతరంగిక నివేదిక చెబుతోంది. సత్సంగ్ ముగిసిన తర్వాత భోలే బాబా వాహనం వైపు జనం పరుగులు తీశారని, దీంతో గందరగోళం నెలకొన్నదని సికంద్రరావు సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ తన నివేదికలో తెలియజేశారు.

నివేదికలో ఏముంది?

సికంద్రరావు-ఎటా జాతీయ రహదారిపై ఫల్‌రాయ్ మొఘల్ గర్హి గ్రామానికి దక్షిణం వైపున ఉన్న ఘటనా స్థలం వద్దకు హరి అలియాస్ భోలే బాబా మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శిబిరం వద్ద రెండు లక్షల మందికి పైగా ప్రజలు ఆయన కోసం ఎదురు చూస్తున్నారు. అయితే కేవలం 80 వేల మందికి మాత్రమే నిర్వాహకులు అనుమతి తీసుకున్నారు. సత్సంగ్ గంట సేపు కొనసాగింది. మధ్యాహ్నం1.40 గంటల ప్రాంతంలో ప్రాంగణాన్ని వదిలి వెళ్లేందుకు భోలే బాబా జాతీయ రహదారి వైపు కదిలారు. దీంతో పురుషులు, మహిళలు, చిన్నారులు ఆయన నడిచిన దారి వద్దకు పరుగులు తీశారు. బాబా నడిచిన చోట ఆయన పాదధూళిని తీసుకొని నుదుటిపై రాసుకునేందుకు పోటీ పడ్డారు. పాదధూళిని నుదుటిపై రాసుకుంటే బాబా ఆశీర్వదించినట్లేనని వారు భావించారు. అప్పటికే బాబా దర్శనం కోసం రోడ్డుకు ఇరువైపులా జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. బాబా వాహనం సమీపించగానే వారు డివైడర్‌ను దాటుకొని దాని వైపు పరుగులు తీశారు. బాబా వ్యక్తిగత భద్రతా సిబ్బంది, వాలంటీర్లు వారిని తోసేశారు. దీంతో కొందరు భక్తులు కిందపడ్డారు. అయినప్పటికీ వారి గోడును ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు వాతావరణం వేడిగా ఉండడంతో తీవ్రమైన ఉక్కపోత మధ్య ప్రజలు విలవిలలాడారు. అక్కడి నుండి బయటపడేందుకు బహిరంగ ప్రదేశం వైపు పరుగులు పెట్టారు. ఈ క్రమంలో ఏటవాలుగా ఉన్న చోట చాలా మంది జారి కిందపడిపోయారు.

సహకరించని నిర్వాహకులు

మంగళవారం రాత్రి పది గంటల మిగతా 7లో

మళ్లీ ఉచిత ఇసుక విధానం

- మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా ఉచిత ఇసుక విధానాన్ని మళ్లీ తీసుకువస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ మేరకు విధివిధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో కూడా ఇసుక లభ్యత ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక లోటు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రానున్న మూడు నెలల్లో ఇపుడు టెండర్ దక్కించుకున్న సంస్థతో న్యాయపరమైన చిక్కులు రాకుండా నూతన విధానానికి రూపకల్పన చేస్తామన్నారు. అప్పటిదాకా జిల్లా కలెక్టర్లు ప్రజలకు ఉచిత ఇసుకను అందించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున సెప్టెంబరు దాకా రీచ్‌లలో ఇసుక త్రవ్వకాలకు వీలుండదని, రానున్న పది రోజుల్లో రాష్ట్రంలో అధికారికంగా, అనధికారికంగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించి అక్కడ వున్న ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హాయంలో ఇసుక లభ్యం కాక నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతిందన్నారు. అధికారంలోకి రాగానే తొమ్మిది నెలలపాటు ఇసుకను సాధారణ ప్రజలకు ఎవరికీ దొరక్కుండా చేశారని విమర్శించారు. నిర్మాణ రంగంలోని 40 రకాలుగా ఉపాధి పొందుతున్న వారంతా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. లక్షలాది మంది జీవనోపాధి కోల్పోయారని అన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు ఇసుకను అడ్డుపెట్టుకుని వైసిపి నేతలు దోచుకున్నారని అన్నారు. ఇసుకను ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలనే కేంద్రంగా

అమరావతిని పునర్నిర్మిస్తాం

- న్యాయపరమైన చిక్కులు తొలగిస్తాం
- శ్వేతపత్రం విడుదలలో చంద్రబాబు ప్రకటన



శ్వేతపత్రంలోని అంశాలను వివరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయపరమైన చిక్కులు తొలగించి అమరావతిని రాష్ట్ర రాజధానిగా పునర్నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన అమరాతిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరాతిని సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, నిధుల కోసం కేంద్రాన్ని కోరతామనిచెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా అమరావతిని ఆపబోమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరు గర్వంగా చెప్పుకునేలా అమరావతిని రూపొందిస్తామని చెప్పారు. దీనికోసం కొత్త ప్రణాళికలు ఏమీ లేవని, పాతవాటితోనే పనులు చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి ఎటువైపు నుండి చూసినా అమరావతి సమదూరంలో ఉందని, రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు ఇచ్చారని, ఇతర భూములూ కలుపుకుంటే 53,475 ఎకరాలు వచ్చిందని పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే రికార్డని, ఇంత పెద్ద స్థాయిలో భూ సమీకరణ ఎక్కడా జరగలేదని అన్నారు

జగన్ అన్యాయం చేశారు. .

అమరావతిని నాశనం చేసి తెలుగు జాతికి జగన్ తీరని అన్యాయం చేశారని చెప్పారు. అసెంబ్లీలో అమరావతి రాజధానిగా ఉండాలని చెప్పిన ఆయన అధికారంలోకి రాగానే మాట మర్చారని అన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు రాజధాని మొత్తం భూమిలో రోడ్లు ఇతర నిర్మాణాలకు 27,885 ఎకరాలు, రిటర్నబుల్ ప్లాట్ల కింద 11,826 ఎకరాలు, ఇతర అవసరాలకు 14,037 ఎకరాలు పోను 8274 ఎకరాలు ప్రభుత్వం వద్ద ఉంటుందని తేల్చినట్లు చెప్పారు.

దీంతో రాజధాని నిర్మాణం చేయొచ్చని అనుకున్నామని, కేంద్రం కూడా రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు ఇచ్చిందని చెప్పారు. సింగపూర్ సాయంతో మాస్టర్‌ప్లాను తయారు చేశామని, అన్ని భవనాలు ఒకేచోట ఉండాలని ప్లాను చేస్తే వైసిపి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరించిందని తెలిపారు. రూ.51,687 కోట్లతో అభివృద్ధికి అంచనా వేసి రూ.41,170 కోట్లకు టెండర్లు పిలిచామని చెప్పారు. అప్పటికే జరిగిన నిర్మాణాలకు రూ.4,318 కోట్లు బిల్లు చెల్లించగా రూ.1268 కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని పరిధిలో నిర్మాణాలన్నీ నిలిపేశారని అన్నారు. వ్యవసాయ కూలీలకు అందించాల్సిన పెన్షన్లు, రైతులకు ఇవ్వాల్సిన కౌలుకు కూడా ఇబ్బందుల సృష్టించారని తెలిపారు. సింగపూర్ కన్సార్టియంపైనా ఆరోపణలు చేశారని, హ్యాపినెస్ట్ పూర్తయితే ప్రభుత్వానికి రూ.54 కోట్ల ఆదాయం వచ్చేదని, ఆపేయడం వల్ల రూ.164 కోట్ల నష్టం వచ్చిందని చెప్పారు. వ్యవస్థలను ఇలా ఛిన్నాభిన్నం చేస్తే పెట్టుబడిదారులు ముందుకురారని, సింగపూర్‌కు చెందిన సంస్థలయితే ఆలోచనలో పడ్డాయని పేర్కొన్నారు. అమరావతికి సంబంధించి రేటింగ్స్ కూడా దెబ్బతిన్నాయని, దీనివల్ల రుణాలు ఇవ్వాలన్నా బ్యాంకర్లు ఆలోచించే పరిస్థితి ఉందని తెలిపారు.

బ్రాండ్‌ను దెబ్బతీశారు

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అమరావతి బ్రాండ్ దెబ్బతిందని, నిర్మాణ ఖర్చు పెరిగిందని, పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లిందని వివరించారు. రాష్ట్రంలోని యువత చిన్నపాటి ఉపాధికి కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చిందని, రెవెన్యూ అదాయమూ తగ్గిపోయిందని చెప్పారు. రాజధాని పరిధిలో రోడ్లనూ తవ్వుకుపోయారని చెప్పారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన అన్ని పునాదులూ నీళ్లలో ముంచేశారని పేర్కొన్నారు. అన్ని రకాల నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపేశారని వివరించారు. 2019లో ఎక్కడున్నామో ఐదేళ్లపాటు అక్కడే ఉన్నామని, ఆర్థికంగా దెబ్బతిన్నామని చెప్పారు.

దెబ్బతిన్నచోట నుండే బంగారు భవిష్యత్

రాష్ట్ర అభివృద్ధిపై ప్రజలకు నమ్మకం రావాలని, గత పాలకులు నాశనం చేసిన ప్రాంతం నుండే బంగారు భవిష్యత్‌కు నాంది పలుకుతామని చంద్రబాబు తెలిపారు. ప్రజా రాజధాని మిగతా 7లో

నీట్ స్కాంపై

నేడు విద్యాసంస్థల బంద్

- కేంద్ర విద్యా శాఖ మంత్రి తప్పుకోవాల్సిందే
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన
- సంఘీభావం తెలిపిన సిపిఎం ఎంపీలు



జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి సంఘాలు చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలియజేస్తున్న సిపిఎం ఎంపీ అమ్రారామ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజ్‌కు కేంద్ర బిందువు అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, అందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్‌టిఎ పనితీరు, నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ బుధవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎ, సమాజ్‌వాదీ ఛత్రి సభ, ఇతర విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ప్లకార్డులు చేబూని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌టిఎకి, కేంద్ర విద్యా శాఖ మంత్రికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ ఆందోళనకు సిపిఎం ఎంపిలు అమ్రారామ్, బికాష్ రంజన్ భట్టాచార్య, వి.శివదాసన్‌లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విపి సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ 'న్యాయమైన, సమర్థమైన పరీక్షా విధానాన్ని నిర్వహించడంలో ఎన్‌టిఎ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరంతర పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాల్లో ఇది మిగతా 7లో

రాజ్యసభలోనూ

మోడీ అదే పాట

- ప్రతిపక్షాల వాకౌట్



రాజ్యసభలో ప్రసంగిస్తున్న మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


బుధవారం రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అసత్య ప్రసంగాన్ని నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోడీ రెండు గంటల పాటు సమాధానమిచ్చారు. లోక్‌సభలో మాదిరిగానే ఇక్కడ కూడా ప్రతిపక్షాలనే టార్గెట్‌గా చేసుకున్నారు. మణిపూర్ అంశంపైనా ఎదురు దాడి చేశారు. ప్రధాని అసత్య ప్రచారానికి దీనిని వేదికగా చేసుకున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్య ప్రధాని మోడీ ప్రసంగం కొనసాగింది. రాబోయే ఐదేళ్లలో పేదరికంపై పోరులో విజయం సాధిస్తామన్నారు. 140 కోట్ల మంది ప్రజలను ప్రతిపక్షాలు అవమానిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే తనలాంటి వారు పార్లమెంట్ వరకు రాగలిగారని అన్నారు. . కాంగ్రెస్ హయాంలో రూ. 60,000 కోట్ల వరకు రైతుల రుణాలను మాఫీ చేసినా లబ్ధిదారుల జాబితాలో చిన్న, సన్నకారు రైతుల పేర్లు ఉండేవి కావని ఆరోపించారు. చర్చల్లో వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంటే వినే ధైర్యం వారికి లేకపోయిందని ఎద్దేవా చేశారు. సభ ప్రారంభం కాగానే రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఎంపి హర్భజన్ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తరువాత తెలంగాణకు చెందిన మాజీ ఎంపి డి.శ్రీనివాస్ మృతికి, అలాగే ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతులకు సభ సంతాపం తెలియజేసింది.

అసత్యాలకు నిరసనగానే వాకౌట్: ఖర్గే

ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ప్రధాని ప్రసంగంలో కొన్ని తప్పుడు అంశాలను మిగతా 7లో

ఎపిపిఎస్‌సి ఛైర్మన్ సవాంగ్ రాజీనామా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామాను గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఆమోదం తెలిపారు. ఐపిఎస్ అధికారి అయిన సవాంగ్ 2019 మే నుంచి 2022 ఫిబ్రవరి వరకు డిజిపిగా కొనసాగారు. గత వైసిపి ప్రభుత్వం డిజిపి స్థాయి నుంచి ఆయనను అర్ధాంతరంగా తొలగించి ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌గా నియమించింది. 2022 ఫిబ్రవరి 19వ తేదీన ఆయన ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. 2025 జులై 9వ తేదీ వరకు ఆయన ఉద్యోగ కాలం ఉన్నా ఏడాది ముందుగానే రాజీనామా చేశారు.

'కాంకర్'పై 'ప్రయివేట్' కత్తి!

- ఐదు నుంచి ఏడు శాతం వాటా విక్రయానికి కేంద్రం తహతహ

3

మెగా డిఎస్‌సి, టెట్ వాయిదా!

- అభ్యర్థుల వినతి మేరకే : ప్రభుత్వం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిర్వహించాల్సిన మెగా డిఎస్‌సి, టెట్‌లను కొంతకాలం పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా బిఇడి, డిఎడ్ పూర్తి చేసుకున్న వారికి కూడా అవకాశం ఇవ్వాలంటూ అభ్యర్థులతో పాటు, వివిధ సంఘాల నుండి అందిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సమయమివ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభ్యర్థులు, యువజన సంఘాల నేతలు, పలువురు ఎమ్మెల్సీలు కోరినట్లు అధికారవర్గాలు తెలిపాయి. వీరి విజ్ఞప్తి మేరకు పరీక్షల నిర్వహణను వాయిదా వేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులకు లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. తాజాగా మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వాస్తవానికి టెట్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలు కావాల్సి ఉంది. అయితే దీనిని 90 రోజులపాటు వాయిదా వేశారు. టెట్ ప్రక్రియ ముగిసిన తరువాత డిఎస్‌సి ప్రక్రియ ప్రారంభమవుతుంది. 2025 జనవరి నాటికి మెగా డిఎస్‌సి పోస్టులను భర్తీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు లోకేష్ ఆదేశాలు జారీ చేశారు.

గ్రూప్-2 మెయిన్స్ కూడా..

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించనున్న గ్రూప్-2 ప్రధాన పరీక్ష కూడా వాయిదా పడింది. ఈ నెల 28న నిర్వహించాల్సిన పరీక్షను పాలనాపరమైన కారణాలు వల్ల వాయిదా వేస్తున్నట్లు ఎపిపిఎస్‌సి కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సవరించిన పరీక్ష తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 7న ఎపిపిఎస్‌సి 897 గ్రూప్-2 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 10న జరిగిన స్క్రీనింగ్ పరీక్షలో 92,950 మంది అభ్యర్థులు ప్రధాన పరీక్షకు అర్హత సాధించారు.

80వేల మార్క్‌ను తాకిన సెన్సెక్స్

ముంబయి :



దేశీయ స్టాక్ మార్కెట్లు ఊహించని రీతిలో పరుగులు పెడుతూ.. నూతన మైలురాళ్లను నమోదు చేస్తున్నాయి. కొనుగోళ్ల మద్దతుతో బుధవారం ఓ దశలో బిఎస్ఇ సెన్సెక్స్ 80వేల మార్క్‌ను తాకి నూతన చరిత్ర సృష్టించింది. ఆరంభంలోనే 80,014 పాయింట్ల ఎగువన ట్రేడింగ్‌ను ప్రారంభించింది. బిఎస్ఇ చివరికి 545 పాయింట్ల లాభంతో 79,987కు చేరింది. నిఫ్టీ 163 పాయింట్లు లాభపడి 24,286.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 79,755 – 80,074 మధ్య కదలాడింది. ఇటీవలే 75 వేల మార్కును అందుకున్న సెన్సెక్స్ కేవలం రెండు నెలల్లోనే 80 వేల మార్కును చేరుకోవడం విశేషం. సెన్సెక్స్‌లో అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. టిసిఎస్, టైటాన్, రిలయన్స్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

'పట్టిసీమ' నీటి విడుదల

- నదుల అనుసంధానంతోనే కరువు నివారణ
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల



పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు విడుదలవుతున్న గోదావరి జలాలు

ప్రజాశక్తి- పోలవరం, తాళ్లపూడి, సీతానగరం

ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతిస్తుందని తెలిపారు. నదుల అనుసంధానంతోనే కరువు నివారణ సాధ్యమని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం, తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని తాడిపూడి, సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలను బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15 రోజులు ముందుగానే నీటిని విడుదల చేయడం వల్ల ముందస్తు ఖరీఫ్ సాగుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రాయలసీమకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఒకే రోజు నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం రికార్డని తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఎనిమిది వేల క్యూసెక్కులు, తాడిపూడి ద్వారా 875 క్యూసెక్కుల నీటిని కృష్ణా డెల్టాలోని రైతులకు, పురుషోత్తపట్నం ద్వారా 3,500 క్యూసెక్కులు, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పెంచి ఉత్తరాంధ్రకు సాగునీరు, తాగునీరు అందిస్తామని వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కూడా నీరు అందిస్తామన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్రానికి జీవనాడైన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి నిమ్మల విమర్శించారు. రివర్స్ టెండరింగ్ వల్ల పనుల్లో జాప్యంతో పాటూ ప్రాజెక్టు నిర్మాణం అంచనా పెరిగిందని తెలిపారు. సమస్యలను తొందర్లోనే అధిగమించి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని, పోలవరం ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతాంగాన్ని ఆదుకుంటామని అన్నారు. చంద్రబాబు చొరవ వల్లే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైందని పేర్కొన్నారు.

అమరావతిలో పనులు ఇలా...

- రూ.9617 కోట్లతో టెండర్లు
- రూ.1958 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి


ప్రభుత్వ కాంప్లెక్స్ నమూన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'రాజధాని అమరావతి లో 2019 వరకూ రూ.9617 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలవ్వగా ఇప్పటివరకు రూ.1958 కోట్ల రూపాయల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీనికి సంబంధించి ఇంకా 1268 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించాల్సిఉందిజ' ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ వివరాలు పేర్కొన్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఇప్పటికీ ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారని, అదే సమయంలో ప్రభుత్వం వద్ద నిధులు లేవని తెలిపారు. ఖజానా ఖాళీ అయిందని కూడా పేర్కొన్నారు. శ్వేతపత్రంలో తెలిపినవ వివరాల మేరకు అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లు రూ.700 కోట్లతో చేపట్టగా వాటిలో రూ.444 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. ఇవి 80 శాతం పూర్తయ్యాయి. రూ.1355 కోట్లతో ఎన్‌జిఓల నివాసాలు నిర్మాణం చేపట్టగా రూ.522 కోట్ల విలువైన పనులు(62 శాతం) పూర్తి చేశారు. అలాగే ప్రభుత్వ అధికారుల టైప్-1, టైప్-2, గ్రూప్‌డి నిర్మాణాలకు రూ.975 కోట్లు కేటాయించగా రూ.408 కోట్ల విలువైన 66 శాతం పనులు పూర్తి చేశారు. మొత్తం 17 ప్రాజెక్టులకు సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీల బంగళాలు రూ.275 కోట్లతో చేపట్టి రూ.61 కోట్లు వెచ్చించారు. మంత్రులు, జడ్జిల బంగళాలకు రూ.235 కోట్లతో చేపట్టి రూ.54 కోట్ల విలువైన పనులు చేశారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్ రూ.115 కోట్లకుగాను రూ.110 కోట్లు, ఫేజ్-2లో 64 కోట్లకుగాను రూ.55 కోట్లతో పనులు పూర్తి చేశారు. అలాగే అడ్వకేట్ల బ్లాకులు వీటికి కూడా 26 కోట్లు వెచ్చించారు. కీలకమైన అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్‌కు రూ.1556 కోట్లతో చేపట్టి రూ.26 కోట్ల విలువైన ర్యాఫ్టులు మాత్రమే పోశారు. అనంతరం టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

జిఎడి టవర్లు రూ.662 కోట్లతో పనులు మొదలుపెట్టి రూ.53 కోట్లు వెచ్చించారు. అలాగే నాలుగు టవర్లకుగాను రూ.2041 కోట్లతో పనులు చేపట్టి రూ.117 కోట్ల విలువైన పనులను మాత్రమే పూర్తి చేశారు. అసెంబ్లీ నిర్మాణానికి రూ.555 కోట్లు ఖర్చు అయ్యాయి. ఈ పనులు జరుగుతున్న సమయంలోనే టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయింది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అప్పట్లో 25 శాతం పూర్తికాని పనులను నిలిపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అమరావతిలో అప్పటికే కీలకమైన ప్రాజెక్టులు చాలా వరకూ 30 నుండి 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. అయినా, వాటిని కూడా వదిలేశారు. 'దీంతో జరగరాని నష్టం జరిగింది. భవనాలు ఖాళీగా ఉండిపోవడంతో వాటి నిర్మాణం కోసం వేసిన ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోయాయి. వాటిని మరలా నిర్మించాలంటే పైన తుప్పుపట్టిన చువ్వలు తొలిగించడంతోపాటు వాటినిర్మాణానికి అవసరమైన లింకును కలిపేందుకు ఉన్న నిర్మాణాలను కొన్నిటిని పగుల కొట్టాల్సి ఉంది. ఇది అదనపు పనితోపాటు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.' అని శ్వేతపత్రంలో పేర్కొన్నారు.

అప్పులే ఆధారం ...!

- వడ్డీ కిందే రూ.2,646.93 కోట్లు చెల్లింపు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కీలక రాజధాని నిర్మాణం విషయంలోనూ ప్రభుత్వం అప్పుల మీదే ఆధారపడింది. తనకాళ్లపై తాను నిలబడి డబ్బు సంపాదించుకోగల నగరంగా చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు జరిగిన నిర్మాణాలన్నీ అప్పులమీద ఆధారపడినవే కావడం గమనార్హం. శ్వేతపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం సిఆర్‌డిఏ తీసుకున్న అప్పులకు రూ.2,646.93 కోట్లను వడ్డీ రూపంలోనూ, రూ.530.77 ప్రిన్సిపల్ ఎమౌంట్ రూపంలోనూ చెల్లించింది. సిఆర్‌డిఏకి డెవపల్‌మెంట్ మీద తప్ప మరే ఇతర మార్గాల్లో ఆదాయం లేకపోయినప్పటికీ వందల కోట్లలో అప్పులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటిల్లో హడ్కో నుండి రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.1,151.59 కోట్లు 9.10 శాతం వడ్డీకి తీసుకొచ్చారు. 15 ఏళ్లకు క్వార్టర్లీ పద్ధతిలో వీటిని చెల్లించాల్సి ఉంది. ఐదేళ్ల మారిటోరియం ముగిసిన నేపథ్యంలో రూ.230.77 కోట్ల ప్రిన్సిపల్ ఏమౌంట్ రూ.643.07 కోట్ల వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. వేర్వేరు ప్రాజెక్టుల కోసం అమరావతి బాండ్స్ రూపంలో రెండు వేల కోట్ల రూపాయలు 10.31 శాతం వడ్డీకి తీసుకొచ్చారు. దీనికి రూ.300 కోట్ల అసలు, రూ.1,179 కోట్ల వడ్డీ చెల్లించారు. హౌసింగ్ ప్రాజెక్టుల కోసం బ్యాంకుల కన్సార్టియం నుండి రూ.1,955 కోట్లను 8.50 శాతం వడ్డీకి తీసుకున్నారు. దీనికి అసలు చెల్లించకపోయినా రూ.824.78 కోట్ల వడ్డీ చెల్లించారు. మొత్తం అప్పులో రూ.530 కోట్లు చెల్లించారు. అసల్లో సగం ఇప్పటికే చెల్లించేశారు. నిర్మాణాలు ఆగిపోవడం వాటి నుండి వస్తాయన్న అద్దెలు, ఆదాయాలు, పన్నులు రాకపోవడంతో ఆర్థికంగా పెనుభారంగా మారింది. ఇటీవల బ్యాంకులు తమ అప్పు కట్టాలని నోటీసు ఇచ్చాయి. లేనిపక్షంలో ఎన్‌పిఏలో చేరుస్తామని, దేశంలో మరే బ్యాంకు నుండి అప్పు తీసుకోలేరని హెచ్చరించాయి. దీంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు చెల్లించింది. గత ఏడాది ఇదో పెద్ద సమస్యగా ముందుకు వచ్చింది. అప్పు అలాగే ఉండటం, వడ్డీ అంతకంతకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే అంశంగా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

పడిపోయిన రేటింగ్స్

అప్పులు పెరగడం పనులు లేకపోవడం, తీసుకున్న బాండ్లకు డబ్బులు చెల్లించకపోవడంతో అమరావతి రేటింగ్ పడిపోయింది. తొలుత అక్యూట్ రేటింగ్ 2018లో ఎఎ ఉంటే ప్రస్తుతం 'సి' కి పడిపోయింది. బ్రిక్స్‌వర్కు రేటింగ్ 2018లో ఎఎ ఉంటే ప్రస్తుతం బిబి ప్లస్‌కు పడిపోయింది. దీంతో నిధులు రాకకు గ్యారంటీ లేకుండా పోయింది. సిబిల్ రేటింగ్‌కు సంబంధించి క్రిసిల్ ఎప్లస్ రేటింగ్ ఇవ్వగా ప్రస్తుతం బిబి ప్లస్‌కు పడిపోయింది. దీనివల్ల రుణాలు రావాలన్నా, పెట్టుబడులు పెట్టేవారు ఇక్కడ పెట్టిన కంపెనీలకు రుణాలు తీసుకోవాలన్నా సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు.

సేకరించాల్సిన భూమి 4,181 ఎకరాలు

- భూసేకరణ నోటీసులు వెనక్కు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని వ్యాప్తంగా ల్యాండ్ పూలింగు ఏరియాలో రైతులకు ప్లాట్లు కేటాయించాల్సిన ప్రాంతంలో 4,300 ఎకరాలు సేకరించాల్సి ఉంది. దీనిలో 2,680 ఎకరాలకు సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టారు. వీటిల్లో 191.62 ఎకరాలను మాత్రమే సేకరించారు. మిగిలిన 4,181 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అయితే గతంలో పూలింగుకు తాము భూములు ఇవ్వబోమని చెప్పి కేసులు దాఖలు చేసిన ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు, నవులూరు వంటి ప్రాంతాల్లో 1,197.30 ఎకరాల భూ సేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను వైసిపి ప్రభుత్వం 2023లో వెనక్కు తీసుకుంది. ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు లాంటి ప్రాంతాలతోపాటు వేర్వేరు చోట్ల మొత్తంగా 2,010 ఎకరాలను సేకరించాలని సిఆర్‌డిఎ కమిషనర్ సూచనల మేరకు గుంటూరు జిల్లా కలెక్టరు సేకరణ ప్రకటన విడుదల చేశారు. దీనిలో గ్రామ సభలు, సమావేశాలూ నిర్వహించారు. రైతులకు నోటీసులు ఇచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత 369.23 ఎకరాలకు చెందిన రైతులు పూలింగుకు అంగీకరించడంతో ప్రకటన నుండి వాటిని మినహాయించారు. 191.62 ఎకరాల రైతులు సేకరణకు అంగీకరించడంతో డబ్బులు చెల్లించేశారు. రోడ్ల కింద 334.95 ఎకరాలు పోయాయి. వేర్వేరు సంస్థలకు 8.40 ఎకరాలు కేటాయించేశారు. మిగిలిన 1,197.30 ఎకరాల సేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. దీంతో సేకరణకు ప్రభుత్వం తొలి నుండి ప్రక్రియను మొదలుపెట్టాల్సి ఉంది. ఇప్పటికే కోర్టుల్లో పలు కేసులు నడుస్తున్నందున ఈ సేకరణ వ్యవహారం రాజధాని నిర్మాణంలో కొంత ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రజా రాజధాని
అమరావతి
శ్వేతపత్రం

నిర్మాణం జరిగి ఉంటే ... రూ.2 లక్షల కోట్లకు జిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణం జరిగి ఉంటే రాష్ట్రానికి అదనపు ఆదాయం సమకూరేదని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. రాజధాని కార్యకలాపాలు మొదలైతే ఇక్కడ ట్యాక్సులు, వ్యాపారాలు, లావాదేవీలు పెరిగేవని దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని అంచనా వేశారు. 2019 నుండి 2024 వరకూ నిర్మాణాలు ఆగిపోవడంతో అన్ని విధాలా ఆదాయం కోల్పోయామని, రావాల్సిన జిడిపిని పొందలేకపోయామని వివరించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో 50 వేల నుండి లక్షలమంది నివసిస్తున్నారని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యి ఉంటే ఏడు లక్షల మంది ఉపాధి కలిగేదని, మాస్టర్‌ప్లాను, జనాభా అంచనాల్లోనూ ఈవిషయాన్ని ప్రస్తావించామని తెలిపారు. అలాగే జిడిపి రెండు లక్షల కోట్లు కలిసేదని తెలిపారు. రాష్ట్ర పన్నులు ప్రతి సంవత్సరం 15 శాతం ఇంక్రిమెంట్‌తో కలిస్తే రూ.10 వేల కోట్ల ఆదాయం వచ్చేదని వివరించారు. పనులు నిలిచిపోవడం వల్ల ఈ ఆదాయం మొత్తం తగ్గిందని తెలిపారు. అమరావతిలో నవనగరాలు నిర్మించడం ద్వారా ప్రతి నగరంలోనూ కనీసం లక్ష మందికి తక్కువగాకుండా ఉద్యోగులు, నివాసం ఉండేవారు వస్తారని, దీనివల్ల కనీసం పదిలక్షల మంది జనాభా పెరిగేదనీ అప్పట్లో అంచనాలు వేసినట్లు తెలిపారు. వారి కోసం మార్కెట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఇతర చిల్లర వ్యాపారాలు, తయారీ సంస్థలు, విద్యా సంస్థలు వంటివన్నీ ఏర్పాట్లయ్యేయని, వాటివల్ల ఆదాయం పెరిగేదనీ పేర్కొన్నారు. ప్రజారవణా, విద్యుత్ తదితర సదుపాయాలు, సౌకర్యాలపై విధించే పన్నుల ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చుని, ఇక్కడ ఏర్పాటు చేసే విద్యా సంస్థలు, కంపెనీల నుండి రావాల్సిన పన్నులు, లావాదేవీల నుండి జరిగే జిఎస్‌టి ద్వారా ఆదాయం రెట్టింపయ్యేదనీ పేర్కొన్నారు. ప్రసుత్తం అటువంటివేమీ లేకపోవడంతో మళ్లీ మొదటికి వచ్చిందని శ్వేతపత్రంలో పేర్కొన్నారు.

ఆర్థిక అవసరాలకు 8,274 ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పరిధిలో సమీకరించిన భూమిలో 8,274 ఎకరాలను ఆర్థిక అవసరాల కోసం వినియోగించుకోనున్నట్లు ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొంది. పూలింగు సమయంలో ఇక్కడ భూమి నుండి వచ్చే ఆదాయం ద్వారా రాజధాని నిర్మించుకోవచ్చని 2019కు ముందు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కనీసం 8 వేల ఎకరాలు మిగులు ఉంటుందని పేర్కొన్నారు. అంత భూమి ప్రభుత్వానికి ఎందుకనే చర్చ అప్పట్లోనే జరిగింది. అంత ఉండకపోవచ్చని నాలుగు వేల ఎకరాలు మాత్రమే మిగలొచ్చని తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన శ్వేతపత్రంలో అసలు విషయాన్ని స్పష్టం చేశారు. 53,748 ఎకరాల్లో రోడ్లు ఇతర సదుపాయాల కోసం 27,885 ఎకరాలు, రైతులకు ప్లాట్లు తిరిగి ఇచ్చేందుకు 11,826 ఎకరాలు, ఇతర అవసరాల కోసం 14,037 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. అయితే ఇతర అవసరాలు ఏమిటనేది శ్వేతపత్రంలో ప్రస్తావించలేదు. మిగిలిన 8,274 ఎకరాలను మానిటైజేషన్ (నిధుల రూపంలోకి మార్చుకోవడం) కోసం అందుబాటులో ఉన్నట్లు నివేదికలో పొందుపరిచారు. ప్రస్తుతం అమరావతి ర్యాంకింగ్ దెబ్బతినడంతో వీటిని ఎలా ఉపయోగిస్తారనే అంశంపై చర్చ జరుగుతోంది. శ్వేతపత్రం విడుదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ర్యాంకింగ్ లేకపోతే పెట్టుబడి సంస్థలు రావని, బ్యాంకర్లూ రుణాలు ఇవ్వరని తెలిపారు. ఇప్పుడో పెద్ద సమస్యగా ఉంటుందనీ తెలిపారు. స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో ముందుకొచ్చిన సింగపూర్ కన్సార్టియంను రద్దు చేశారని, ఇప్పుడు సింగపూర్ సంస్థలు కూడా ముందుకు వస్తాయా లేదా అనే అంశంపై ఆలోచనలో పడ్డట్లు పేర్కొన్నారు.

25,186 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో పూలింగుకు తీసుకున్న భూముల నుండి రైతులకు ఇచ్చిన ప్లాట్లలో 25,186 ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ విషయాన్ని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. రాజధాని పరిధిలో 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 53,748 ఎకరాల్లో రైతుల నుండి 34,281.12 ఎకరాలు సమీకరించారు. వీటిల్లో 33,836 పాస్‌బుక్ ఖాతాదారులు ఉన్నారు. ఇంకా 4,300 ఎకరాలు సేకరించాల్సి ఉంది. వీటికి సంబంధించి రైతులకు నివాస ప్రాంత ప్లాట్లు 37,479, వాణిజ్య ప్లాట్లు 25,931 మొత్తం 63,410 ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. వీటిల్లో 22,592 నివాస ప్రాంత ప్లాట్లను, 15,632 వాణిజ్య ప్లాట్లను రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తంగా 38,224 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా 25,186 ప్లాట్లను రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. కొంతమంది రైతులు కోర్టుల్లో కేసులు దాఖలు చేసినందున వాటిని వెనక్కు తీసుకున్న అనంతరం రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని ఇటీవల చంద్రబాబునాయుడు వద్ద ప్రస్తావించారు. ఎక్కుమంది వైసిపి ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్లకు సిద్ధపడలేదు. 1,631 రోజుల పోరాటం అనంతరం ప్రభుత్వం మారడంతో ఇప్పుడు పూర్తిగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటామని రైతులు హామీనిచ్చారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని శ్వేతపత్రంలో తెలిపారు. ఈ ప్లాట్లను రూ.16,071 కోట్లతో అభివృద్ధి చేయాలని అంచనాలు వేయగా 2019 నాటికి రూ.410.73 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు.

గవర్నరుతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గుజ్జుల వెంకటలక్ష్మి రాజ్‌భవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. చైర్మన్‌గా నియామకం తర్వాత మొదటిసారి గవర్నరును ఆమె కలిశారు.

ఈ సందర్భంగా మహిళా కమిషన్ కార్యక్రమాల గురించి గవర్నరు అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్, ప్యాకేజింగ్ బ్రాండింగ్‌లో మహిళా కమిషన్ ప్రోత్సాహం అవసరమని గవర్నరు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడమే కాకుండా కమిషన్ వివిధ శిక్షణ కార్యక్రమాల పట్ల దృష్టి సారించినట్లు గవర్నరుకు ఆమె వివరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

టీచర్లపై యాప్‌ల భారం తగ్గించండి

- తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) కోరింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యాప్‌ల భారం తగ్గించాలని ఆదేశాలిచ్చినా అధికారులు స్పందించడం లేదని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక గూగుల్ ఫారం ఇచ్చి సాయంత్రంలోగా పూర్తిచేసి పంపించాలని చెబుతున్నారని తెలిపారు. బడికిపోతా, విద్యా ప్రవేశ్ అనే రెండు కార్యక్రమాల వల్ల బోధనపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. టీచ్‌టూల్ ప్రోగ్రాం పేరుతో శిక్షణ, పాఠశాలల విజిట్స్‌తో ఉపాధ్యాయులు బోధనకు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ఆన్‌లైన్ వర్క్స్, బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు లేకుండా చేయాలని కోరారు.

ప్రతి రూపాయికీ లెక్క చెప్పాల్సిందే

- బహిరంగ సభలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్


బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసమే పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నానని డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. హోం, రెవెన్యూ, ఆర్థిక శాఖలు తీసుకోమని అడిగారని, ప్రజల కోసమే పంచాయతీరాజ్ శాఖను తీసుకున్నానని తెలిపారు. ప్రజల డబ్బు విషయంలో ప్రతి రూపాయికీ లెక్క చెప్పాల్సిందేనని తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన వారాహి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. భారీ మెజారిటీతో గెలిపించిన పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయం ప్రజలకే అంకితం చేస్తున్నానన్నారు.

'పిఠాపురం ప్రజలకు, అన్ని వర్గాలు, మతాలు, కులాల వారికి హామీ ఇస్తున్నా... మానవత్వాన్ని కాపాడతాను, లంచాలు తీసుకోను, మీ అభ్యున్నతికి కష్టపడతాను' అంటూ ప్రమాణం చేశారు. తాను త్వరలో పిఠాపురం వాస్తవ్యుడిగా మారతానని ప్రకటించారు. మూడు ఎకరాలను కొనుగోలు చేసి తాజాగా రిజిస్ట్రేషన్ కూడా చేయించానని తెలిపారు. కూటమి అధికారంలోకొచ్చిన మొదటి నెల ఒకటో తేదీనే వలంటీర్లు లేకుండా పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. ప్రజాధనంలో ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వనన్నారు. అందుకే జీతం కూడా లేకుండా పని చేస్తున్నానని తెలిపారు. కాకినాడ సెజ్‌లో పరిశ్రమలు తెచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆర్థిక లోటు ఉన్న నేపథ్యంలో వనరులను సమకూర్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

రాష్ట్రానికి నిధులు తీసుకొచ్చే బాధ్యత ఆయనదే తెలిపారు. తొలుత ఆయన ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు కారణాలు, నివారణోపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. సభలో కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌కు డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బంద్‌కు ప్రజలందరూ సహకరించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బిజెపి సంకీర్ణ ప్రభుత్వం నీట్, నెట్ పరీక్షలను నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని, ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో నీట్ లీకేజ్‌పై ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పరీక్షల మాఫియాను పెంచి పోషించే పద్ధతులను మానుకోవాలని, తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా ఐక్య పోరాటాలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణనే ప్రధాన ధ్యేయంగా ఐక్య పోరాటాలు నిర్వహించనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1238వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఆర్‌ఎం-1, 2 విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరినప్పటికీ ఉక్కు కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సి ఉందని తెలిపారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేందుకు కృషి చేయాలని, సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సాయం అందిస్తే త్వరితగతిన ప్లాంట్ లాభాలబాట పడుతుందని తెలిపారు.

శ్వేతపత్రం కాదది.. పచ్చ పత్రం

- మాజీ మంత్రి సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసింది శ్వేతపత్రం కాదని, అది పచ్చ పత్రమని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలాంటి ఆధారాల్లేకుండా రాజకీయ కోణంలో అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అమరావతిలో ఎన్నో నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. రోడ్లు, భవన నిర్మాణాలను ముందుకు తీసుకెళ్లామని అన్నారు. రాజధానిలో అన్ని తరగతులవారు ఉండాలని తమ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే టిడిపి నాయకులు అడ్డుకోలేదా? అని ప్రశ్నించారు. అమరావతిలో పేదలకు భూములు ఎందుకు ఇవ్వలేకపోయారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలవరంపై నేడు తుది నివేదిక

- ఢిల్లీలో విడుదల చేయనున్న నిపుణుల బృందం
- ముగిసిన క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న పనుల పరిశీలనకు వచ్చిన అంతర్జాతీయ నిపుణులు సీన్ హించ్ బెర్గర్, డేవిడ్ బి పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో, రిచర్డ్ డొనెల్లీల బృందం నాలుగు రోజుల పర్యటన బుధవారం సాయంత్రంతో ముగిసింది. వారంతా ఢిల్లీ వెళ్లిపోయారు. నాలుగు రోజుల పర్యటనలో రెండు రోజులు దెబ్బతిన్న పనులు, మరో రెండు రోజులు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, సీపేజీ ప్రాంతాలు, డయా ఫ్రంవాల్, ఫిజియో మీటర్లు అమర్చిన ప్రాంతం, ఎర్త్ కం ర్యాక్ ఫిల్ డ్యాం ప్రాంతంలో వైబో కాంప్రాక్షన్ పనులను బృందం నిశితంగా పరిశీలించింది. చివరి రోజు బుధవారం సైతం మరోసారి ఎగువ కాఫర్ డ్యాంపై పలుచోట్ల కేసింగ్ పైపులు భూగర్భంలోకి దింపి ఆధునిక పరికరాలతో సీ పేజీ జలాల తీవ్రత ఎంత లోతులో నుంచి పైకి ఎగదన్నుతుందన్న విషయాలను పరిశీలన చేసింది. ప్రాజెక్టు వద్ద కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, సంబంధిత కన్సల్టెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కాఫర్ డ్యాం నిర్మాణంలో నడుమ మట్టితో నిర్మించిన కోర్ నిర్మాణంలో నిర్మాణ ఆకృతి, మట్టి, రాతి నాణ్యతా ప్రమాణాలు, నిర్మాణం అంశాలలో అంచనాలు వేసే విషయంలో పొరపాట్లు జరిగి సీ పేజీ ఏర్పడినట్లుగా నిపుణుల బృందం భావించింది. దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు సంబంధించి నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఎంత మేరకు ఉంది? లేదా దెబ్బతిన్న వాల్ ప్రాంతాల్లో మాత్రమే సమాంతరంగా కొంతమేర డయాఫ్రంవాల్ నిర్మించాలా? సీపేజీ అదుపు చేయడానికి ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణంలో డయాఫ్రం వాల్‌కు ఎలాంటి చర్యలు చేపట్టాలి? ఎలాంటి పరికరాలు వాడాల్సిన ఉంటుంది? అతి తక్కువ వ్యయంతో సమస్యలు ఎలా పరిష్కరించవచ్చు అనే అంశాలపై గురువారం ఢిల్లీలో జరగనున్న సమావేశంలో నిపుణుల బృందం తన నివేదికను సమర్పించనుంది. విదేశీ నిపుణుల బృందం సమీక్షా సమావేశాల్లో సిఎస్ఎంఆర్ఎస్ సైంటిస్ట్ మనీష్ గుప్తా, సిడబ్ల్యుసి డ్యాం డిజైనింగ్ ఎంబాక్ మెంట్ నార్త్ వెస్ట్ సౌత్ నిపుణులు గౌరవ్ తివారి, సిడబ్ల్యుసి డ్యామ్ డిజైనింగ్ నిపుణులు సిఇ అన్వేపు ప్రవీణ్, వ్యాప్కోస్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.పట్నాయక్, పోలవరం ప్రాజెక్టు అథార్టీమెంబర్ సెక్రటరీ రఘురాం, మెగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రంగరాజన్, తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో 1.28 లక్షల గృహాలు పూర్తి

- గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రానున్న 100 రోజుల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు. 2025 మార్చి నాటికి నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను పూర్తి చేస్తామన్నారు. సచివాలయంలో బుధవారం గృహ నిర్మాణశాఖపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎమ్‌డి గిరీషాతో కలిసి అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎస్ఇ, ఇఇలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.2,520 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 6.078 లక్షల గృహాల స్టేజ్ కన్వర్షన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గృహ నిర్మాణాలు జరిగే లే అవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాయలసీమల్లోని థర్మల్ స్టేషన్ల నుంచి వచ్చే ఫ్లైయాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి పార్థసారధి తెలిపారు. ఆప్షన్-3 కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన సమస్యలపై సిఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. 2015లో ప్రారంభమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద జిల్లాల్లో గృహ నిర్మాణాల ప్రగతిని 100 రోజుల లక్ష్యాలపై నియోజకవర్గాల వారీ మంత్రి సమీక్ష నిర్వహించారు.

డిప్యూటేషన్ పద్ధతిలో హౌసింగ్ ఖాళీలు భర్తీ

రాష్ట్ర గృహ నిర్మాణశాఖలో ఖాళీ అయిన పోస్టుల్లో డిప్యూటేషన్ పద్ధతిలో గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్, టెక్నికల్ అసిస్టెంట్లతో భర్తీ చేసే ఆలోచనలో ఉన్నామని మంత్రి పార్థసారధి తెలిపారు. ఇప్పటికే ఈ విషయంపై డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో చర్చించామన్నారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని భావిస్తున్నామన్నారు.

ఆరోపణలపై విచారణ

గృహ నిర్మాణాల విషయంలో ఎక్కువ లాభం వచ్చే వరకు నిర్మాణాలు చేపట్టి అనంతరం వాటిని నిలిపి వేయడంతోపాటు అవసరానికి మించి సిమెంట్, ఇనుము ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయని మంత్రి తెలిపారు. సిమెంటు, ఇనుము నిజంగా ఆయా గృహాల నిర్మాణాలకు వాడారా? లేదా? దారి మళ్లిందా అనే విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పార్థసారధి తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెండింగ్‌లో ఉన్న మే, జూన్ వేతనాలకు సరిపడే బడ్జెట్ విడుదల చేయాలని, సమ్మె కాలం వేతనం చెల్లించాలని ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఫెడరేషన్ చైర్మన్ బి కాంతారావు, సెక్రటరీ జనరల్ యు కళ్యాణి బుధవారం లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్షా పరిధిలో 25 వేల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. సకాలంలో వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడానికి ముందస్తు బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. 22 రోజుల సమ్మె కాలం వేతనం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల రైల్వే పాసులను పునరుద్ధరించాలి

- కేంద్రమంత్రికి ఎంపి కలిశెట్టి వినతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోవిడ్ సమయంలో జర్నలిస్టులకు తాత్కాలికంగా రద్దు చేసిన రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని, సీనియర్ సిటిజనులకు రైల్ టికెట్ ఛార్జీలలో రాయితీని పెంచాలని, వికలాంగులకు రాయితీని అందించే సౌకర్యాలను పెంచాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో రైల్వేశాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

6న ప్రజావేదిక వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమం వాయిదా పడింది. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి శనివారం ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 6న నిర్వహించబోయే ప్రజావేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, టిడిపి శ్రేణులు, అభిమానులు గమనించాలని కార్యాలయం కార్యదర్శి, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరు రాష్ట్రాలకు చెందిన విభజన అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సిఎం చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లో భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో అప్పులపాలైన యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాంపురం తండాకు చెందిన జరవత్ బాలునాయక్ (33)కు ఎకరం సొంత పొలం ఉంది. మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని నాలుగేళ్లుగా మిర్చి, పత్తి సాగు చేస్తున్నారు. ఏటా నష్టాలు వచ్చాయి. గతేడాది కూడా వర్షాలు సరిగా పడక నష్టపోయారు. పంటల సాగు నిమిత్తం సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు చేశారు. వీటిని తీర్చేమార్గంలేక తీవ్ర మనస్తాపంతో పొలానికెళ్లి పురుగుల మందు తాగారు. అనంతరం ఇంటికి వచ్చి పడిపోయారు. గమనించిన కుటుంబీకులు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


రైలు నుంచి జారిపడి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి, నంద్యాల కలెక్టరేట్

రైలు నుంచి జారిపడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన నంద్యాలలోని మూలసాగరం రైల్వే గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తూ వీరు జారిపడి మృతి చెందినట్లు పోలీసులు అభిప్రాయడుతున్నారు. సంఘటనా స్థలానికి రైల్వే పోలీసులు, త్రీ టౌన్ సిఐ నరసింహులు చేరుకొని పరిశీలించారు. రైల్వే ఎస్ఐ జలీల్ ఖాన్ తెలిపిన వివరాలు మేరకు.. ప్రశాంతి ఎక్స్ ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు నంద్యాల మూల సాగరం వద్ద రైలు రన్నింగ్‌లో ఉండగా జారిపడి ఉంటారని తెలిపారు.

పది రోజుల్లో దళితుల భూ సమస్య పరిష్కరించాలి

- దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి
- లేదంటే నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఆందోళన : పి. మధు
- శివాంలో దళితుల పరామర్శ, భూముల పరిశీలన



పెత్తందారుల చేతిలో దాడికి గురైన బాధితులను పరామర్శిస్తున్న మధు

ప్రజాశక్తి - కురుపాం/ గరుగుబిల్లి

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో దళితులపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పి.మధు డిమాండ్ చేశారు. దళితుల భూ సమస్యను పది రోజుల్లో పరిష్కరించాలని, లేదంటే జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇటీవల పెత్తందారుల దాడిలో గాయపడిన శివ్వాం దళితులను బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఎం సీనియన్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణుతో కలిసి ఆయన పరామర్శించారు. డిఎస్‌పి కృష్ణారావు ఆధ్వర్యాన గ్రామంలో మోహరించిన పోలీసులు... సిపిఎం నాయకులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తాము గ్రామంలో పెత్తందారులపై దాడి చేయడానికి రాలేదని, గాయాలపాలైన దళితులను పరామర్శించి వారు సాగు చేస్తున్న భూములు పరిశీలించడానికి వచ్చామని చెప్పడంతో పోలీసులు అనుమతించారు. అనంతరం గాయాల పాలైన దళితులను నాయకులు పరామర్శించారు. గ్రామం నుంచి ర్యాలీగా దళితులు సాగు చేస్తున్న భూమి వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అధ్యక్షతన గ్రామంలో జరిగిన సమావేశంలో మధు మాట్లాడారు.

1970లో 22 ఎకరాల 80 సెంట్ల భూమిని దళితులకు ప్రభుత్వం డి-పట్టా ఇచ్చిందని ఆ భూమిని వారు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారి భూమిలో విత్తనాలు చల్లేందుకు పెత్తందారులు వచ్చారని, ప్రశ్నించిన దళితులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. పది రోజుల్లో సమస్య పరిష్కరించాలని, లేదంటే నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు లేఖ రాస్తానని తెలిపారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. దళితుల భూమి దళితులకు చెందేలా రెవెన్యూ అధికారులతో పోలీసులు మాట్లాడాలని కోరారు. ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇంతటి న్యాయ మైన భూ సమస్య పరిష్కరించడంలోనే ప్రభుత్వ యంత్రాంగం విఫలమైతే సామాన్య పేదలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు శివ్వాం దళితుల భూ సమస్య పరిష్కారం చేసి, దళితులకు భూమి అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం దళితులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో డిఆర్ఒ జి.కేశవనాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.మన్మథరావు, ఎం.తిరుపతిరావు, బివి రమణ, కొల్లి సాంబమూర్తి, మండంగి శ్రీనివాసరావు, గ్రామ దళిత పెద్దలు రేగిడి ఎల్లయ్య, లక్ష్మణరావు ధనంజయ, శివ తదితరులు పాల్గొన్నారు.

రవాణా వాహనాలకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు ఇవ్వండి

2 రాష్ట్రాల సిఎంలకు లారీ ఓనర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు గూడ్స్ రవాణా వాహనాలకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ కోరింది. విభజన సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 6న హైదరాబాద్‌లో భేటీ కానున్న నేపథ్యంలో ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ లారీ ఓనర్ల సమస్యలను అజెండాలో పెట్టాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు.. ఆ లేఖలను బుధవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్ర విభజన తర్వాత లారీ పర్మిట్ల విషయంలో యజమానులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వున్నప్పుడు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, లారీలను కొనుగోలు చేశారని తెలిపారు. విభజన తర్వాత పొరుగు రాష్ట్రంలోకి పోతే రూ.18 వేలు పర్మిట్ కట్టాలని పేర్కొన్నారు. ఇందులో కేంద్రం వాటా రూ.16,500 వుంటే, రాష్ట్రానికి కేవలం రూ.1,500 వస్తుందని తెలిపారు. అదే రెండు రాష్ట్రాలు కౌంటర్ సిగ్నేచర్‌తో పర్మిట్లు ఇస్తే రూ.5 వేలతో సరిపోతుందన్నారు. ఆ రూ.5 వేలు రాష్ట్ర ఖజానాకే వస్తుందని తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు లారీ ఓనర్స్ సమస్యలపై చర్చించి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు, వ్యకాస నాయకులు

ఉపాధి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-సాలూరు రూరల్ (పార్వతీపురం మన్యం జిల్లా)

ఉపాధి హామీ బకాయి వేతనాలు చెల్లించాలని పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఉపాధి కార్మికులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తీవ్రమైన ఎండల్లో రెండు పూటలా కార్మికులు ఉపాధి హామీ పనులు చేశారని తెలిపారు. చేసిన పనికి 8 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. ఆరేడు నెలలుగా ఉపాధి కార్మికులు వ్యవసాయ పనుల్లేక, ఉపాధి పనులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సాగులో యంత్రాలు పెరగడంతో కార్మికులకు పనులు దొరకడం లేదని, దీంతో మళ్లీ వలసలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలను నివారించేందుకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, రోజు కూలి రూ.400 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనిప్రాంతంలో తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, నీడ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో మాదిరిగా పనిముట్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గంజాయి నియంత్రణకు మంత్రుల సబ్ కమిటీ

- నేడు సచివాలయంలో తొలి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు మంత్రుల సబ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హోమ్, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ సబ్ కమిటీలో మానవ వనరుల అభివృద్ధి, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా వున్నారు. ఈ సబ్ కమిటీ తొలి సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో ఉదయం 11 గంటల నుంచి జరగనుంది. ఈ సమావేశంలో డిజిపి, సిఐడి, ఇంటెలిజెన్స్ అదనపు డిజిలు, సెబ్ కమిషనర్, డైరెక్టర్లు పాల్గొంటారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై మంత్రుల సబ్ కమిటీ ఈ సమావేశంలో చర్చించనుంది.

అసమగ్రంగా కులగణన డేటా

- కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ఇబ్బందులు
- ఆందోళనలో విఆర్ఒలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లతో గత వైసిపి ప్రభుత్వం చేయించిన కులగణన డేటా అంతా అసమగ్రంగా ఉందని విఆర్ఒలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమాచారం లేకుండా సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీ చేయడం కత్తిమీద సాములా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అసమగ్ర డేటాను విఆర్ఒల లాగిన్‌లకు పంపిందని, అందులో డోర్ నెంబర్లు సక్రమంగా లేకపోవడం, పుట్టినరోజు తేదీల్లో తప్పులుండటం, చనిపోయిన వారి పేర్లు, తప్పుడు సమాచారంతో ఉన్నాయని, అసమగ్ర సమాచారంతో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేమని విఆర్ఒలు చెబుతున్నారు. అలాగే సమగ్ర సమచారం లేకుండా రోజుకు టార్గెట్లు పెట్టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తుండటంతో మానసికంగా గ్రామ, రెవెన్యూ అధికారులు ఆందోళనలో ఉన్నారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు మంజూరు విషయంలో ప్రభుత్వం పునరాలోచించి తమపై ఒత్తిడి తగ్గించాలని విఆర్ఒ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. సర్టిఫికెట్లు మంజూరు చేసే సమయంలో సమాచారంలో ఏమాత్రం తేడా ఉన్నా భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఐక్యవేదిక ఛైర్మన్ కెఆర్ సూర్యనారాయణ నేతృత్వంలోని రెవెన్యూ సంఘం నాయకులు, తహశీల్దారు సుగుణమ్మ, విఆర్ఒల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి రవీంద్రరాజు, మిరియాల లక్ష్మీనారాయణ బుధవారం రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విఆర్ఒల ప్రమోషన్లు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్, రేషియో విషయంపై మంత్రితో చర్చించారు.

హోదాకు ఇదే మంచి తరుణం : కె రామకృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎపికి ప్రత్యేక హోదా అడిగేందుకు సిఎం చంద్రబాబుకు ఇదే మంచి సమయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. విశాఖ మురళీనగర్ మెయిన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బిజెపి మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. గత ఐదేళ్లలో ఎపిలో అదానీ, అంబానీలకు ఎంత దోచిపెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తోంది ప్రస్తుత కాలంలో వామపక్షాలు మాత్రమేనన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకం సరికాదన్నారు. బిజెపి మంత్రులు ఇప్పట్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఉండదని చెబుతున్నారని, మరోపక్క కేంద్రం కుట్రలను కొనసాగిస్తూనే ఉందన్నారు. మొదట నష్టాలకు గురిచేసి తర్వాత దాన్ని అమ్మి వేయడమే లక్ష్యంగా మోడీ సర్కారు ముందుకెళ్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పోలీసు రాజ్యాంగం అమలు చేశారని, అందుకే ఓటమిపాలై జగన్‌మోహన్‌రెడ్డి మూలన కూర్చున్నారని అన్నారు. ఇవిఎంల పనితీరుపై చర్చ జరగాల్సి ఉందన్నారు. విశాఖ రైల్వే జోన్ పనులు త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జెవి సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు పాల్గొన్నారు.

'కాంకర్'పై 'ప్రయివేట్' కత్తి!

ఐదు నుంచి ఏడు శాతం వాటా విక్రయానికి కేంద్రం తహతహ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (కాంకర్)పై ప్రయివేటీకరణ కత్తి వేలాడుతోంది. ఇందులో ఐదు నుంచి ఏడు శాతం వాటాలను విక్రయించేందుకు కేంద్రం తహతహలాడుతోంది. ఇటీవల జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయాల జాబితాను పరిశీలిస్తూ కాంకర్‌లో ప్రాథమికంగా ఐదు నుంచి ఏడు శాతం వాటాలను విక్రయించే విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. 2019లో కాంకర్‌ను వ్యూహాత్మక అమ్మకాల జాబితాలో ఉంచగా ఉద్యోగ, కార్మిక సంఘాల ఆందోళనతో కేంద్రం వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. 2024లో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ దీనిపై దూకుడు పెంచింది.

పోర్టు స్థలం 108 ఎకరాల్లో ఏర్పాటు

కాంకర్‌కు ఎనిమిది రైల్వే లైన్‌లుండగా ఐదు హ్యాండ్లింగ్ చేస్తోంది. ప్రధానంగా విశాఖ నగరంలో ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్టు సహా ఎన్‌టిపిసి, గంగవరం పోర్టు వ్యాపారాన్ని కంటైనర్లలో దేశ, విదేశాలకు తీసుకెళ్లడంలో కాంకర్‌దే కీలక పాత్ర. 2017లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు (కంటైనర్లు)తో 108 ఎకరాల



పోర్టు స్థలంలో ఇది ప్రారంభమైంది. రెండు లక్షల చదరపు అడుగుల వేర్ హౌసింగ్ సౌకర్యం ఈ లాజిస్టిక్ పార్కు ప్రత్యేకత. రైలు, రోడ్డు మార్గంలో కంటైనర్ బిజినెస్‌లో కొన్ని సంవత్సరాలుగా కాంకర్ ప్రగతి దిశగా సాగుతోంది.

దేశ, విదేశాలకు ఎగ్జిమ్

మన దేశం ఉంచి ఈక్వెడార్‌కు రొయ్యలను ఎగుమతి చేసే ఏకైక సంస్థ కాంకర్. గుజరాత్‌లోని ముంద్రా, కత్వాస్ పోర్టులకు డబుల్ డెక్కర్ కంటైనర్‌లలో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తోంది.

కంటైనర్ ట్రాఫిక్‌ను పరిశీలిస్తే.. 2022-23లో కాంకర్ 64 వేల టిఇయులను దేశం బయట కంటైనర్ కార్గో చేయగా, దేశీయంగా తొమ్మిది వేల టిఇయులు చేసింది. 2024లో కాంకర్ లక్ష్యం దేశీయంగా 14 వేల టిఇయులు. ప్రైవేటీకరణ కత్తి వేలాడుతుందన్న విషయంపై కాంకర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు.

కాంకర్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా ఎంత ?

కాంకర్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా 54.8 శాతంగా ఉంది. దీంట్లో 30.8 శాతం వాటాను వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా విక్రయించాలని కేంద్రం భావిస్తోంది. కాంకర్‌లో 30.8 శాతం విక్రయంతో పాటు యాజమాన్య నియంత్రణ బదిలీ ప్రతిపాదనకు 2019 నవంబరులోనే కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగ సంఘాల నుంచి నాడు వ్యతిరేకత రావడంతో ఆ ప్రతిపాదనను నిలుపుదల చేసింది. తాజాగా మళ్లీ ప్రయివేటీకరణకు రంగం సిద్ధం చేస్తోంది.

అన్ అకాడమీలో మళ్లీ ఉద్వాసనలు

- తాజాగా 250 మందిపై వేటు
- రెండేళ్లలో 2వేల మందికి ఎసరు



న్యూఢిల్లీ : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ అన్‌అకాడమీలో మరోమారు ఉద్యోగులపై వేటు పడింది. తాజాగా 250 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. వ్యయ నియంత్రణ చర్యలతో వ్యాపార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే ప్రక్రియలో భాగంగానే ఈ తొలగింపుల నిర్ణయాన్ని తీసుకున్నట్లు అన్ అకాడమీ వెల్లడించింది. ప్రస్తుతం స్టార్టప్ సంస్థలు చాలా ఇబ్బందుల్లో ఉండటంతో వైఫల్యాలు చెందుతున్నాయని అన్‌అకాడమీ వ్యవస్థాపకుడు, సిఇఒ గౌరవ్ ముంజాల్ ఆందోళన వ్యక్తం చేసిన మరుసటి రోజే ఈ తొలగింపులు ప్రకటన రావడం గమనార్హం. ఏడాది కాలంలో మూడో సార్లు తొలగింపులు చేపట్టింది. గతేడాది మార్చి నెలలోనే భారీగా ఉద్యోగులను తొలగించింది. ఆ సంస్థ ఆన్‌లైన్ విద్యా వ్యాపారం తగ్గిపోవడంతో అప్పుడు 10- 12 శాతం మేర ఉద్యోగులపై వేటు వేసింది. గత రెండేళ్లలో దాదాపు 1,500 నుంచి 2000 మంది వరకు ఉద్యోగులను ఇంటికి పంపించింది. స్థిరమైన వృద్ధి, వ్యాపార సామర్థ్యం పెంపు విషయాలను దృష్టిలో పెట్టుకుని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఈ క్రమంలోనే తాజాగా తొలగింపులను చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ దఫా మార్కెటింగ్, సేల్స్‌తో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులపై వేటు పడిందని సమాచారం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్‌అకాడమీ నష్టాలు 41 శాతం తగ్గి రూ.1678 కోట్లుగా నమోదయ్యాయి. కరోనా ప్రభావం తగ్గిన తర్వాత ఎడ్‌టెక్ సంస్థలు డిమాండ్ లేక ఒత్తిడిలోకి జారుకున్నాయి. బైజూస్ లాంటి దిగ్గజ సంస్థలు దివాలా తీసే స్థితికి జారిపోయాయి.

సామర్థ్య పెంపునకు రూ.230 కోట్ల పెట్టుబడులు

- దేశీయ మార్కెట్‌పైనే ప్రధాన దృష్టి
- ఎజిఐ గ్రీన్‌ప్యాక్ సిఇఒ వెల్లడి

హైదరాబాద్ : ఉత్పత్తిని బలోపేతనం చేయడానికి, ఎగుమతి సామర్థ్యాలను పెంచుకోవడానికి రూ.230 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని ఎజిఐ గ్రీన్‌ప్యాక్ సిఇఒ రాజేష్ ఖోస్లా తెలిపారు. ప్రస్తుత తయారీ లైన్లను ఆధునీకరించడానికి.. అధిక నాణ్యత గ్లాస్ ప్యాకేజింగ్ సొల్యూషన్ల కోసం వ్యయం చేయనున్నామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పెట్టుబడులు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి సహాయ పడనున్నాయన్నారు. భారత మొత్తం ప్యాకేజింగ్ పరిశ్రమ 40 బిలియన్ డాలర్లు (రూ.3.33 లక్షల కోట్లు) విలువ చేస్తుందన్నారు. ఇందులో గ్లాస్ ప్యాకేజింగ్ 6-7 శాతం వాటా కలిగి ఉంటుందన్నారు. ఈ రంగం ప్రతీ ఏడాది 7-8 శాతం వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. గ్లోబల్ గ్లాస్ ప్యాకేజింగ్ పరిశ్రమ 67.28 బిలియన్ డాలర్ల విలువ చేస్తుందన్నారు. 2032 నాటికి 93.69 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్నారు. తెలంగాణలోని ఎజిఐ గ్రీన్‌ప్యాక్ ప్లాంట్‌లలో 4,000 మందిపైగా పని చేస్తున్నారన్నారు. దేశంలో తమకు ఏడు తయారీ ప్లాంట్లు ఉన్నాయన్నారు. రోజుకు 1700 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నామన్నారు. 3మిల్లీ లీటర్ల గాజు సీసాల నుంచి ఆరు లీటర్ల సామర్థ్యం వరకు తయారు చేస్తున్నామన్నారు. తమ మొత్తం రెవెన్యూలో 6-7 శాతం వరకు ఎగుమతుల నుంచి వస్తోందన్నారు. ప్రస్తుతం ఉత్తర అమెరికా, సౌత్ ఆఫ్రికా, మధ్య ఈశాన్య దేశాలకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. ఎగుమతుల కంటే తాము ప్రధానంగా దేశీయ మార్కెట్‌పైనే దృష్టి సారిస్తున్నామని రాజేష్ ఖోస్లా తెలిపారు.

ముగిసిన కూ యాప్ కూత

న్యూఢిల్లీ : ట్విట్టర్‌కు పోటీగా నిలుస్తుందని భావించిన భారత సోషల్ మీడియా యాప్ 'కూ' మూతపడిపోయింది. బుధవారం నుంచి తమ సంస్థ సేవలను నిలిపివేసినట్లు కూ యాప్ సహ వ్యవస్థాపకులు రాధాకృష్ణ వెల్లడించారు. కూ యాప్ విక్రయం కోసం డైలీహంట్ సహా వివిధ కంపెనీలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అమ్మకపు చర్చలు సఫలం కాకపోవడంతో లిటిల్ ఎల్లో బర్డ్ ఇక గుడ్‌బై చెప్పేస్తోందంటూ లింక్‌డ్‌ఇన్‌లో రాధాకృష్ణ వెల్లడించారు. కూ యాప్ 2019లో ప్రారంభమయ్యింది. స్థానిక భాషల్లోనూ దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దాదాపు పదికి పైగా భాషల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా బిజెపి వర్గాలు కూ యాప్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయి. స్వయంగా కేంద్ర మంత్రులు ఆత్మనిర్భర్ యాప్‌గా ప్రచారం చేశారు. ఒక దశలో కూ యాప్‌నకు రోజుకు 21 లక్షల యాక్టివ్ వినియోగదారులు వచ్చారు. ఈ యాప్‌ను 6 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. నైజీరియా, బ్రెజిల్‌కు కార్యకలాపాలను విస్తరించింది. కానీ.. ఈ సంస్థ ఆర్థిక నష్టాలు క్రమంగా పెరిగి పోయాయి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి జారుకుంది. పలు సార్లు ఉద్యోగులపై వేటు వేసింది. కష్టాల్లోంచి బయట పడలేక తుదకు మూత వేసుకుంది.

డిఎన్ఇజి గ్రూపునకు రూ.1670 కోట్ల నిధులు

హైదరాబాద్ : విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ టెక్ సర్వీసెస్ సంస్థ డిఎన్ఇజి గ్రూపు 200 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1670 కోట్లు) నిధులు సమీకరించినట్లు ప్రకటించింది. ఈ మొత్తాన్ని యునైటెడ్ ఎఐ సఫేర్ గ్రూపు నుంచి పొందినట్లు వెల్లడించింది. దీంతో తమ సంస్థ విలువ 2 బిలియన్ డాలర్లు (రూ.16.698 కోట్లు)కు చేరినట్లయ్యిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో అనుబంధ సంస్థ అయినా డిఎన్ఇజి హాలీవుడ్, గ్లోబల్ విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేటర్స్‌కు విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, క్రియేటివ్ సేవలను అందిస్తుంది.

జులై 20-21న అమెజాన్ ప్రైమ్ డే సేల్స్


న్యూఢిల్లీ : జులై 20-21 తేదిల్లో ప్రైమ్ డే సేల్‌ను నిర్వహించనున్నట్లు అమెజాన్ ఇండియా వెల్లడించింది. ఆ రెండు రోజుల్లో అమెజాన్ ప్రైమ్ సభ్యులకు అన్ని వస్తువులపై ప్రత్యేక డిస్కౌంట్‌లు, ఆఫర్లు ఉంటాయని పేర్కొంది. 450 బ్రాండ్స్‌కు చెందిన వేలాది వస్తువులను ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లలో కొనుగోలు చేయవచ్చని తెలిపింది. ఆయా వస్తువులను అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది.

13న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిస్టం అప్‌గ్రేడ్

న్యూఢిల్లీ: తమ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను మెరుగుపర్చుకునేందుకు కొత్త ఇంజినీర్డ్ ప్లాట్‌ఫారమ్‌కు మార్చాలని యోచించామని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. దీంతో జులై 13న కొన్ని సేవల అందుబాటు తాత్కాలికంగా పరిమితంగా ఉంటుందని వెల్లడించింది. ఉదయం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అంతరాయం ఉండొచ్చని తెలిపింది. దేశంలోని తమ 9.3 కోట్ల ఖాతాదారులకు కోర్ బ్యాంకింగ్ సిస్టంలో మెరుగైన సేవలను అందించడానికి కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను న్యూ జెన్ ప్లాట్‌ఫారమ్‌లో హోస్ట్ చేయనున్నామని తెలిపింది.

ఎఎస్ఐ ఆత్మహత్య

ప్రజాశక్తి-వల్లూరు (వైఎస్ఆర్ జిల్లా)



రైలు కింద పడి ఎఎస్ఐ బలవన్మరణానికి పాల్పడిన ఘటన వైఎస్ఆర్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వైఎస్ఆర్ జిల్లా మోడమిదపల్లెకు చెందిన నాగార్జునరెడ్డి (58) కమలాపురం పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్నారు. విధులు ముగిశాక బుధవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో వల్లూరు మండలం తప్పెట్ల బ్రిడ్జి వద్ద యూనిఫాం తీసి పక్కనపెట్టి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించారు. నాగార్జునరెడ్డి 1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఉద్యోగోన్నతి పొంది ఐదేళ్లుగా ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మీ కాంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకుకి వివాహం అయ్యింది. పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగార్జునరెడ్డి మనస్తాపానికి గురై తన వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదని ఆత్మహత్య చేసుకున్నారని కడప రైల్వే ఎస్ఐ శ్రీనివారావు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం నాగార్జునరెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

దళారుల ఏరివేతకు టిటిడి చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీవారి యాత్రికులను మోసగిస్తున్న దళారులను కనిపెట్టి ఎప్పటికప్పుడు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఎస్‌పిని టిటిడి ఇఒ జె.శ్యామలరావు కోరారు. బుధవారం ఆయన తిరుపతి టిటిడి పరిపాలనా భవనంలో జిల్లా పోలీస్, టిటిడి నిఘా, భద్రత విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మాట్లాడుతూ.. వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి శ్రీవారి యాత్రికులను మోసగిస్తున్న దళారులను ఉపేక్షించరాదన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిఎస్ఒ వివరించిన ఆవశ్యకత మేరకు తిరుమలలో ఐటి అనుబంధంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు పరిశీలించవలసిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు పోలీస్ విభాగం వారు పలు అంశాలకు సంబంధించిన కేసులు ఏయే దశల్లో ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మరో వారంలోపు ఈ కేసుల్లో ఉన్న దళారులకు చట్టపరంగా తగు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను ఇఒ కోరారు. ఇటువంటి కేసుల సత్వరానికి టిటిడి విజిలెన్స్, పోలీస్ విభాగాలు తరచూ సమావేశం కావాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, టిటిడి జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఒ నరసింహ కిషోర్, తిరుమల అదనపు ఎస్‌పి విమల కుమారి, డిఎస్‌పి శ్రీనివాస ఆచారి, టిటిడి విజిఒ (విజిలెన్స్) గిరిధర్ పాల్గొన్నారు.

158 ఎర్రచందనం దుంగలు స్వాధీనం .. నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కడప అర్బన్/ఎర్రగుంట్ల

తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.91 కోట్లు విలువైన ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కడప ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ వెల్లడించారు. జమ్మలమడుగు ఎస్‌డిపి ఒటిడి.యశ్వంత్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ ఈశ్వరయ్య తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పోట్లదుర్తి గ్రామ సమీపంలోని కొత్తకాలనీకి వెళ్లే రోడ్డులో 158 ఎర్రచందనం దుంగలను, మినీ లారీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో దూదేకుల బాష, పింజారి మహమ్మద్ రఫీ, అరవోళ్ల రఫీ, చెల్లుబోయిన శివసాయి ఉన్నారని చెప్పారు.

సంపాదకీయం

ఘోరం ...

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో నిర్వహించిన ఒక మతపరమైన కార్యక్రమం 120 మందికి పైగా అమాయకుల ప్రాణాలను బలిగొనడం దారుణం. సత్సంగ్ పేరిట జరిగిన ఈ కార్యక్రమం ముగింపు సందర్భంలో 'స్వయం ప్రకటిత దేవుడి' పాదధూళి సేకరించడానికి భక్తులు పోటీ పడటంతో అనూహ్యంగా చోటుచేసుకున్న తొక్కిసలాట ఈ దారుణానికి కారణం. ఈ ఘటన జరిగిన 24 గంటల తరువాత కూడా సంఘటన స్థలంలోనూ, ఆసుపత్రుల వద్ద హృదయవిదారక దృశ్యాలు కనపడుతున్నాయి. తొక్కిసలాట తరువాత అనేక మంది కనపడకుండా పోయారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మృత దేహాల్లో తమ ఆత్మీయుల కోసం వెతుకుతున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. గాయ పడిన వారిలోనూ కొందరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరగ వచ్చన్న వార్తలు కలవరాన్ని సృష్టిస్తున్నాయి. మరణించిన వారిలో దాదాపు అందరూ పేద, మధ్య తరగతి ప్రజలే కావడం గమనార్హం. నిత్య జీవితంలో ఎదురయ్యే కష్టాలు, కన్నీళ్ల నుండి విముక్తి లభిస్తుందన్న ఆశతో ఈ కార్యక్రమానికి హాజరైన వీరు ప్రాణాలను కోల్పోవాల్సిరావడం బాధాకరం.

యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వంలో ఉత్తరప్రదేశ్‌లో నెలకొన్న అరాచక పరిస్థితుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గో గూండాల దాడులు, కరోనా విజృంభణ, రైతాంగ ఆందోళనలు ఇలా అనేక సందర్భాల్లో అక్కడి అధికార యంత్రాంగం వ్యవహరించిన తీరు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. తాజా సంఘటన తరువాత కూడా వారి వైఖరిలో ఎటువంటి మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆరే దీనికి నిదర్శనం. ఇంతటి విషాదానికి కారణమైన స్వయం ప్రకటిత దేవుడు సూరజ్ పాల్ అకా నారాయణ్ సాకర్ హరి అలియాస్ భోలే బాబా పేరును ఎఫ్‌ఐఆర్‌లో నిందితునిగా పేర్కొనలేదు. ఆయన సహాయకుడు, సత్సంగ్ ప్రధాన నిర్వాహకుడైన దేవ ప్రకాశ్ మధుకర్‌తో పాటు మరికొందరు గుర్తుతెలియని వ్యక్తుల పేర్లను నిందితులుగా పేర్కొన్నారు. 'స్వయం ప్రకటిత దేవుడి'ని అరెస్ట్ చేస్తారా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆ రాష్ట్ర పోలీస్ చీఫ్ ప్రశాంత్ కుమార్ 'దర్యాప్తును ప్రభావితం చేసేలా మాట్లాడకూడదు.' అని జవాబిచ్చారు. అదే సమయంలో భోలే బాబాపై కనీస నిఘా పెట్టే ప్రయత్నం కూడా చేయలేదు. దీనిని అవకాశంగా తీసుకున్న ఆ 'స్వయం ప్రకటిత దేవుడు' బుధవారం మధ్యాహ్నం నుండి అదృశ్యమైనట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే ఇంతకన్నా ఘోర నిర్లక్ష్యం మరొకటి ఉండదు.

ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వడం నుండి, బందోబస్తు ఏర్పాటు వరకు ప్రతిదీ అనుమానాస్పదంగానే కనిపిస్తోంది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం సత్సంగ్‌కు 80 వేల మంది వస్తారని చెబుతూ నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకున్నారు. కానీ, అధికారిక లెక్కల ప్రకారమే 2.50 లక్షల మంది హాజరయ్యారు. ఈ స్థాయిలో ప్రజానీకం ఒక కార్యక్రమానికి హాజరవుతున్న విషయాన్ని నిఘా యంత్రాంగం ఎందుకు గుర్తించలేకపోయిందో తేలాల్సి ఉంది. పోనీ, 80 వేల మందికైనా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారా? 50 మందికంటే ఎక్కువ మంది పోలీసులు కనిపించలేదని స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇంతకన్నా బాధ్యతా రాహిత్యం మరొకటి ఉందా? గతంలో పోలీస్ శాఖలో కొంతకాలం పనిచేసిన ఈ స్వయం ప్రకటిత దేవునికి లైంగిక వేధింపుల కేసులో జైలుకెళ్లిన చరిత్ర కూడా ఉంది. కరోనా సమయంలో 50 మందితో సత్సంగ్ నిర్వహిస్తానని అనుమతి తీసుకుని 50 వేల మందితో ఆ కార్యక్రమాన్ని నిర్వహించి వైరస్ వ్యాప్తికి కారణమైన ఘనత కూడా ఈయనదే! అయినా, రాష్ట్ర ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దిగ్భ్రాంతికరం. సామాన్య ప్రజానీకం పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ తీరు ఇకనైనా మారాలి. దేవుడి పేరుతోనో, దెయ్యం పేరుతోనో సామాన్యులను భయభ్రాంతులకు గురిచేసి వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకునే ఘరానా వ్యక్తులకు అంటకాగడం మానాలి. తక్షణం భోలే బాబాను అరెస్ట్ చేయాలి. బాధిత కుటుంబాల సభ్యులకు ప్రభుత్వం అండగా నిలవాలి. మూఢత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి.

మంచి మాట



చే గువేరా చెప్పినట్లు ప్రతి ఫ్యాక్టరీ
ఒక పాఠశాల కావాలి. అక్కడ ఇనుము,
అల్యూమినియం, ఇతర వస్తువులను
ఉత్పత్తి చేయడంతో పాటు
సరికొత్త స్త్రీపురుషులను,
సరికొత్త సమాజాన్ని,
సోషలిస్టు సమాజాన్ని
ఉత్పత్తి చేయాలి.

- హ్యూగో చావెజ్

విశ్లేషణ

నూతన న్యాయ చట్టాల అమలు తొందరపాటు చర్య





డా॥ కె. రామ్ కిశోర్

> **ఈ మూడు చట్టాల అమలు తీరుపై ప్రతి క్లాజును పార్లమెంటులోనూ, సివిల్ సొసైటీలోనూ విస్తృతంగా చర్చ జరగాలి. సీనియర్ న్యాయవాదులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, పత్రికా సంపాదకులు, ప్రముఖ జర్నలిస్టులు, లా కాలేజీలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లతో చర్చలు జరిపి వారి సలహాలు, సూచనలు కేంద్రం స్వీకరించాలి. వారు లేవనెత్తిన లోపాలు సవరించాలి. అవసరమైన సంస్థాగత మార్పులు చేయాలి. పోలీసులకు, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కూడా సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించి చట్టాల అమలులో తలెత్తే సమస్యలను పరిష్కరించాలి. అవసరమైన నూతన 'సాఫ్ట్‌వేర్'ను కేసుల నమోదుకు రూపొందించాలి. పాత, కొత్త చట్టాలకు సంబంధించిన కేసులను వాదించేటప్పుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలను పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వం బేషజాలకు పోయి తొందరపాటుతో ఈ చట్టాలను అమలు చేయరాదు.**

ఇప్పటివరకు అమలులో వున్న బ్రిటీష్ చట్టాల స్థానాల్లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు జులై 1, సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సి.ఆర్.పి.సి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐ.ఎ.ఎ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బి.ఎన్.ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి.ఎన్.ఎస్.ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బి.ఎస్.ఎ) అమలులోకి వచ్చాయి. అయితే వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. చర్చ లేకుండా ఆమోదించడమేంటని పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగాయి. వీటి అమలు నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే ఓ పిటిషన్ దాఖలైంది. గతేడాది డిసెంబర్‌లో సదరు చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభ నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారనీ, పార్లమెంటు సభ్యులతో చర్చ జరపకుండానే కేంద్రం బిల్లులను ఏక పక్షంగా ఆమోదించిందని పిటిషనర్లు అంజలీ పటేల్, ఛాయా మిశ్రా పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలు సేకరించలేదన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని గుర్తుచేశారు. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయని, పోలీసులకు విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరొక వైపు ఈ కొత్త నేరచట్టాల అమలును పార్లమెంటులో చర్చించేంత వరకు వాయిదా వేయాలని కోరుతూ పౌరహక్కుల ప్రజా సంఘం (పి.యు.సి.ఎల్) కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు లేఖ రాసింది.

ప్రజాస్వామ్యంపై తీవ్ర ప్రభావం

క్రిమినల్ లాయర్లు, దర్యాప్తు సంస్థలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరులతో విస్తృత స్థాయిలో సంప్రదించి వారి అభిప్రాయాలను సేకరించకుండానే ఈ చట్టాలను తొందరపాటుతో తీసుకొచ్చారని గుర్తుచేసింది. భారతదేశ ప్రజాస్వామ్యంపై దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావం చూపే ఈ చట్టాలపై ఇప్పటికైనా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చలు జరపాలని, అప్పటివరకు వాటి అమలును వాయిదా వేయాలని పి.సి.ఎల్ గట్టిగా కోరింది. వలస చట్టాల నుంచి బయట పడుతున్నామని చెబుతూనే నాటి బ్రిటీష్ చట్టాలలోని అనేక అంశాలను యథాతథంగా నూతన చట్టాల్లో కూడా తీసుకొచ్చారని పి.యు.సి.ఎల్ వెల్లడించింది. న్యాయ సంహిత చట్టంలో గ్యాంగ్, వ్యవస్థీకృత నేరస్తులు, ముఠాల వంటి పదాలు ఉన్నాయి. కానీ, వాటిని స్పష్టంగా నిర్వచించలేదు. ఫలితంగా అమాయకులను కూడా కేసుల్లో ఇరికించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు అంటు న్నారు. న్యాయ సంహిత ప్రకారం మానసిక వికలాంగులకు విచారణ నుంచి రక్షణ లభిస్తుంది. అయితే బుద్ధిమాంద్యం ఉన్నవారిని ఈ కేటగిరిలో చేర్చలేదు. దీంతో వారిపై కూడా కేసులు నమోదు చేయవచ్చు. నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం పోలీసులు నిందితులను తమ కస్టడీలో 15 రోజులు ఉంచుకోవచ్చు. అంతేకాదు, ఆ తర్వాత కూడా 40 నుంచి 60 రోజులు వరకు అదనపు కస్టడీని కోరవచ్చు. ఈ కస్టడీని ఒకే దఫాలో కానీ పలు దఫాలలో గానీ అమలు పరచవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

'రాజద్రోహం' స్థానంలో 'దేశద్రోహం'

ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవిడెన్స్ యాక్ట్ ద్వితీయ స్థాయి సాక్ష్యాధారాల (సెకండరీ లెవల్ ఎవిడెన్స్)గా పరిగణిస్తే, దాని స్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అధినియమ్ వాటిని ప్రథమ స్థాయి సాక్ష్యాధారులుగా పరిగణిస్తుంది. తద్వారా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి సాధనాలతో పాటు, సెమీ కండక్టర్ మెమరీలో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని కూడా సాక్ష్యాధారంగా భావిస్తుంది. వీటిని సాక్ష్యంగా పరిగణించే కొత్త చట్టం పోలీసులు వీటిని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు లేదా తనిఖీ నిర్వహించినప్పుడు వాటిల్లో లేని సమాచారాన్ని పోలీసులే స్వయంగా గతంలో మాదిరిగా "పెగాసస్" వంటి ఏదైనా సాఫ్ట్ వేర్‌తో చొప్పించే ప్రమాదకరమైన పరిస్థితి కూడా ఉంటుంది. ఈ విషయంలో ఎలాంటి వివరణ ఈ చట్టాల్లో లేదు. స్వాతంత్ర్యోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని కేంద్రం నాడు సుప్రీంకోర్టులో తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి 'రాజ ద్రోహం' చట్టాన్ని 'దేశ ద్రోహం' పేరుతో తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకు ఉన్న హక్కును హరించి వేయటానికే ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలు ఎంతో కాలంగా ఉన్నాయి. అరెస్టు సందర్భంగా నిందితుల చేతులకు బేడీలు వేయటాన్ని పునరుద్ధరించటం సరైంది కాదు. తప్పనిసరిగా బాధితుల నుండి ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ప్రస్తుత నిబంధనను తొలగించడాన్ని పాతకాలపు పోకడలకు దేశాన్ని వెనక్కు తీసుకెళ్లడంగా పలువురు విమర్శిస్తున్నారు.

అందరికీ సవాళ్లే

కొత్త చట్టాల అమలుకు ముందు (2024 జులై 1వ తేదీకి ముందు) జరిగిన నేరాలను ఐపిసి తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. జులై 1 నుంచి జరిగే నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారణ జరపాల్సి ఉంటుంది. ఇది తీవ్ర గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉంది. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కేసుల నమోదు విషయంలో పోలీసులకూ ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతాయి. నిందితులు వీడియో కాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయి. కానీ, దేశంలో 80 శాతం కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. ఈ కొత్త చట్టాల విషయంలో సుప్రీంకోర్టు ఏం తీర్పు చెబుతుందో వేచిచూడాలి. ఈ నూతన చట్టాల అమలుకు కోర్టు అంగీకరిస్తే...భారతీయ భాషలలోకి ఈ మూడు చట్టాలను వివరంగా, సరళంగా అనువాదాలు వెలువడాలి. ఈ మూడు చట్టాల అమలు తీరుపై ప్రతి క్లాజును పార్లమెంటులోనూ, సివిల్ సొసైటీలోనూ విస్తృతంగా చర్చ జరగాలి. సీనియర్ న్యాయవాదులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయ మూర్తులు, పత్రికా సంపాదకులు, ప్రముఖ జర్నలిస్టులు, లా కాలేజీలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లతో చర్చలు జరిపి వారి సలహాలు, సూచనలు కేంద్రం స్వీకరించాలి. వారు లేవనెత్తిన లోపాలు సవరించాలి. అవసరమైన సంస్థాగత మార్పులు చేయాలి. పోలీసులకు, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కూడా సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించి చట్టాల అమలులో తలెత్తే సమస్యలను పరిష్కరించాలి. అవసరమైన నూతన 'సాఫ్ట్‌వేర్'ను కేసుల నమోదుకు రూపొందించాలి. పాత, కొత్త చట్టాలకు సంబంధించిన కేసులను వాదించేటప్పుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలను పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వం బేషజాలకు పోయి తొందరపాటుతో ఈ చట్టాలను అమలు చేయరాదు.

/ వ్యాసకర్త సెల్ : 9849328496 /



వాన నీటిలో ఢిల్లీ...

- సజన్ ఎల్జిన్

ఢిల్లీలో సాధారణంగా వర్షాలు పడవు. అరగంట సేపు వర్షం కురిస్తే బాగా పడినట్టు. అలాంటిది గత శుక్రవారం ఉదయం ఏకబిగిన ఐదు గంటల పాటు వాన కురిసింది. దేశ రాజధాని మొత్తం నీటిలో మునిగిపోయింది. దాంతో వాహనదారుల, పాదచారుల రాకపోకలకు, విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అండర్‌పాస్‌లో చిక్కుకుని, విద్యుదాఘాతానికి గురై, గోడ కూలి 11 మంది చనిపోయారు. ప్రపంచ స్థాయి నిర్మాణంగా పేరొందిన బహుళ అంతస్తుల భవనాల పార్కింగ్ కేంద్రాలు జలమయమయ్యాయి. న్యూఢిల్లీలోని లుటియన్స్ ప్రాంతంలోని ఎంపీల ఇళ్లలోకి కూడా నీరు చేరింది. అంతేగాక, సామాన్య ప్రజలు, ప్రజాప్రతినిధుల నివాసాలు సైతం మురుగు నీటిలో మునిగిపోయాయి.

కుండపోత వర్షం

88 ఏళ్ల ఢిల్లీ చరిత్రలో జూన్ 28న ఇరవై నాలుగు గంటల వ్యవధిలో భారీ వర్షపాతం నమోదైంది. 22.81 సెం.మీ వర్షం కురిసింది. కుండపోత వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధిపతి మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో 28వ తేదీ ఉదయం గంటకు తొమ్మిది సెంటీమీటర్ల వర్షం కురిసింది. అదే సమయంలో, భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో వరద పరిస్థితి ఏర్పడింది.

పెరుగుతున్న జనాభా

ప్రపంచంలోకెల్లా అత్యంత జన సాంద్రత కలిగిన నగరాల్లో ఒకటి ఢిల్లీ. 2030 నాటికి ఢిల్లీ ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా టోక్యోను అధిగమిస్తుందని ఐక్యరాజ్యసమితి 2018లో ప్రచురించిన ఒక నివేదికలో సూచించింది. 2030 నాటికి ఢిల్లీ జనాభా 3.9 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఇక్కడ జనాభా 2000లో 1.16 కోట్లు వుండగా, 2020లో 3 కోట్లు, 2023లో 3.2 కోట్లు వుంది.

52 కి.మీ పొడవు, 48.5 కి.మీ వెడల్పు కలిగిన ఢిల్లీ నగరానికి అనేక ప్రాంతాల నుంచి వలస వస్తుంటారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, వృత్తి నిపుణులను మొదలుకొని కూలీల వరకు ప్రతి రోజు కొత్తవారు ఢిల్లీకి చేరుకుంటున్నారు. సగటు వార్షిక జనాభా వృద్ధి 2.7 శాతం వుంటుంది. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, నిర్మాణాలు ఢిల్లీ స్థలాకృతికి అనుకూలంగా లేవని నిపుణులు అనేకసార్లు హెచ్చరించారు. అవినీతి, నిర్వహణా లోపం వల్ల ఏర్పడిన సమస్యలే ఇవన్నీ.

అవినీతి, అశాస్త్రీయ నిర్మాణాలు

జి-20 శిఖరాగ్ర సమావేశానికి ముందు 2022 జూన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రగతి మైదాన్ సొరంగాన్ని ప్రారంభించారు. రెండేళ్ల క్రితం రూ.920 కోట్లతో నిర్మించిన ఈ సొరంగంలో పగుళ్లు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికి కూడా 1.3 కి.మీ సొరంగంలో లీకేజీల కారణంగా నీరు నిలిచిపోయే అవకాశం ఉంది. డ్రైనేజీ సమస్యలు, నీటి ఎద్దడి నిత్యం సమస్యలుగా మారాయి. గత రెండు వర్షాల్లోనూ నీటి కారణంగా ఇక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజుల పాటు నగరం నిండు కుండలా ఉంది. సొరంగంలో నిర్మాణ పనులకు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులే బాధ్యత వహించాలని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకున్నారు.

తూర్పు కిద్వాయ్ నగర్‌లో కేంద్ర ప్రభుత్వ అధికారుల కోసం నిర్మించిన 14 అంతస్తుల భవనాన్ని అశాస్త్రీయంగా నిర్మించడం వల్లే దెబ్బతింది. నేల మట్టం కింద నిర్మించిన మూడంతస్తుల పార్కింగ్ ఏరియా నీటితో నిండిపోయింది. 24 గంటల పాటు వందలాది వాహనాలు నీట మునిగాయి. 4608 అపార్ట్‌మెంట్లు ఉన్న ఈ కాంప్లెక్స్‌లో చాలా వరకు లిఫ్టులు పనిచేయవు. అలాగే గోడలకు పగుళ్లు వచ్చాయని ఖైదీలు చెబుతున్నారు. అండర్‌గ్రౌండ్ మెట్రో లైన్లు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా పని చేశాయని, మరి కొన్నిచోట్ల మాత్రం నిర్మాణ లోపాల వల్ల ఇబ్బందులు తలెత్తాయని స్పష్టమవుతోంది. రికార్డుల ప్రకారం ఢిల్లీలో దాదాపు వెయ్యి నీటి వనరులున్నాయి. ఇప్పుడు సుమారుగా 400 మాత్రమే చూడగలుగుతున్నాం. మిగిలిన 600 అదృశ్యమయ్యాయి. అంటే ఆక్రమణలకు గురయ్యాయి. వర్షపు నీరు ప్రవహించే చోటు లేకపోవడం ఢిల్లీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య.


సమన్వయంతో పరిష్కారం

వాటర్ డ్యామ్‌పై కూడా రాజకీయ యుద్ధం మొదలైంది. వచ్చే వర్షాకాలంలో ఢిల్లీ కూడా మునిగిపోతుందని, దీనికి ఆప్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బిజెపి, కాంగ్రెస్‌లు చెబుతున్నాయి. కేంద్రం నియంత్రణలో ఉన్న ఎన్.డి.ఎం.సి (న్యూఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్) ప్రాంతంలో అనేకానేక సమస్యలు ఉన్నాయని ఆప్ తిప్పికొట్టింది. ఎంపీలు, మంత్రులు, న్యాయమూర్తుల ఇళ్లు నీట మునగడం ఇదే తొలిసారి. కాలువలు శుభ్రం చేసేందుకు కేటాయించిన నిధులు ఎక్కడికి పోయాయని ఆప్ ప్రశ్నిస్తోంది. ఢిల్లీలో ఈ దుస్థితిని రాజకీయ పార్టీల సమస్యగా చూడలేం. దేశ రాజధాని ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి సమన్వయంతో ముందుకు సాగాలి.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో /

వ్యాఖ్య

ఎన్‌ఇపి నష్టదాయకం



> **రాష్ట్రంలో 117 జీ.ఓ అమలు చేసి, తరగతులను విలీనం చేయడం వలన జరిగే నష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలలు కళకళలాడే స్థితి నుంచి కళా విహీనంగా మారిపోయాయి. ఒక్క విద్యార్థి కూడా చేరని పాఠశాలలు 6,500, ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్న బడులు 158, ముగ్గురు ఉన్న బడులు 290, ఒక్క విద్యార్థి ఉన్న బడులు 73. మూతబడిన పాఠశాలలు 5921. దాదాపు 4,200 పై చిలుకు బడులను విలీనం చేశారు. 3,4,5 తరగతుల విలీనం తరువాత ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. అన్నదమ్ములను, అక్కచెల్లెళ్లను విడదీయడంతో ఆ పిల్లలు ఆందోళనకు గురి అయ్యారు. అటువంటి పరిస్థితులకు కారణమైన 117 జీ.ఓ, 172 జీ.ఓ లను రద్దు చేసి రాష్ట్ర విద్యా రంగాన్ని రక్షించాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉంది. విద్యా రంగంలో నష్టదాయక సంస్కరణలు ఆగాలంటే ఎన్‌ఇపి-2020ని ఆపాలి.**



కె. విజయగౌరి

ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా జాతి నిర్మాణానికి విలువలు కలిగిన విద్యార్థులను తయారు చేయడమే విద్యా వ్యవస్థ లక్ష్యం. గడచిన అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో సంస్కరణల ప్రభావం అనేక నష్టాలకు దారి తీసింది. సరిగ్గా దేశంలో కోవిడ్ కష్ట కాలంలో ఉండగా అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో తీవ్రమైన విద్యా సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఉన్న కరోనా సమయంలో దీనికి సంబంధించిన చట్టాలు, జీఓలు తీసుకురావడానికి, అమలు చేయడానికి పూనుకున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం (ఎన్.ఇ.పి)-2020 పేరుతో చట్టం చేసింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఇపిలో భాగంగా విద్య పున:వ్యవస్థీకరణ ప్రాజెక్టు పేరుతో సంస్కరణలు చేపట్టామని ప్రకటించింది. కొద్ది రోజులలోనే ఎన్‌ఇపికి అనుగుణంగా 172, 117 వంటి జీఓలను, ఉత్తర్వులను జారీ చేసి అమలు చేయడం మొదలు పెట్టింది.

పాఠశాల విద్యలో సమూల మార్పులు

10+2 విద్య నిర్మాణ స్థానంలో 5+3+3+4 విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. పునాది దశ 3 సంవత్సరాల ప్రీ స్కూల్, ప్రాథమిక పాఠశాలలు-1,2 తరగతులుగా, ప్రిపరేటరీ దశ- 3-5 తరగతులుగా, మధ్య దశ 6-8 తరగతులుగా, సెకండరీ దశ 9-12 తరగతులుగా విడదీసింది. 1 నుండి 5 తరగతులుగా ఉన్న ప్రాథమిక పాఠశాలలు వేల సంఖ్యలో 1,2 తరగతులుగా మిగిలిపోయాయి. కి.మీ దూరం లోపల హైస్కూలుకు దగ్గరలో గల ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను విలీనం చేసిన ఫలితంగా, ఉన్నత పాఠశాలలను ఆంగ్ల మీడియంకు పరిమితం చేసిన ఫలితంగా 2020-21 విద్యా సంవత్సరంలో 46 లక్షలు పైచిలుకుగల విద్యార్థులు 36 లక్షలకు తగ్గిపోయారు. హై స్కూలులో ఒకే మీడియం ఆధారంగా ఉపాధ్యాయుల పోస్టులను కుదించారు. పీరియడ్ల సంఖ్య పెరిగి పని భారం పెరిగింది. రేషనలైజేషన్ ప్రక్రియ పెద్ద ఎత్తున జరిగింది.ఎంత విచిత్రమంటే హైస్కూలులో 3, 4, 5 తరగతులను విలీనం చేశారు గనుక ఆ విద్యార్థుల బోధనకు ప్రాథమికోన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లను హైస్కూలుకు తరలించారు. అంటే ఆ పాఠశాలల్లో చదువుతున్న 6,7,8 తరగతుల విద్యార్థులకు స్కూల్ అసిసెంట్లు అవసరం లేదని భావించారు. సెకండరీగ్రేడ్ టీచర్లే వారికి బోధన చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. క్రమేణా యు.పి పాఠశాలల్లో విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల బాట పట్టారు. ప్రైమరీ పాఠశాలలను హైస్కూళ్లలో విలీనం చేయడం వలన విద్యార్థులు అక్కడ ఇమడలేక ప్రైవేట్ స్కూళ్లకు కొంతమంది, డ్రాపవుట్లగా కొంత మంది మిగిలారు. మరల మరుసటి ఏడాది యు.పి స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్లు ఉండాలని ఒకే మీడియం అమలు ప్రాతిపదికన హైస్కూళ్ల నుంచి అదనపు పోస్టులుగా తేల్చి యు.పి స్కూళ్లకి పంపించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో గందరగోళ పరిస్థితులు దాపురించాయి.

సంస్కరణల ప్రభావం

2023-24 విద్యా సంవత్సరం నాటికి 39 లక్షలు ఎన్‌రోల్‌మెంట్ ఉంటుందని ప్రకటించిన రెండు నెలల నుండే ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 4 లక్షల మంది తగ్గిపోయారు. మొదటి సంస్కరణ-3,4,5 తరగతుల విద్యార్థులను బలవంతంగా హైస్కూళ్లలో విలీనం చేయడం. రెండవ సంస్కరణ-1,2 తరగతులు మాత్రమే ప్రాథమిక పాఠశాలల్లో మిగిలి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడం. మూడవ సంస్కరణ-ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను హైస్కూళ్లకు తరలించడం. నాల్గవ సంస్కరణ -యు.పి స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేకుండా వాటిని ఎస్.జి.టి లతో బోధన చేయించడాన్ని గమనించిన తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రయివేటు స్కూళ్లలో చేర్పించారు. ఐదవ సంస్కరణ-3వ తరగతి నుండే ఇంగ్లీషు మీడియం తప్పనిసరి చేయడంతో విద్యార్థులు ఏ మీడియంలో చదువుకోవాలనే ఆప్షన్ లేకపోవడంతో డ్రాపవుట్లుగా మారారు. ఆరవ సంస్కరణ ఉపాధ్యాయుల కొరతను నియామకాల ద్వారా కాకుండా అవసరం అయిన చోటికి నిబంధనలకు విరుద్ధంగా రేషనలైజేషన్, అడ్జస్టుమెంట్లు చేయడం విద్యార్థుల బోధన, పర్యవేక్షణపై తీవ్ర ప్రభావం చూపడంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు ఆసక్తి కొరవడింది. ఏడవ సంస్కరణ-రాష్ట్ర సిలబస్‌ను కాదని, విద్యా హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేసి దశలవారీగా సిబిఎస్‌ఇ సిలబస్‌ను రాష్ట్ర పాఠశాలల్లో ప్రవేశపెట్టడం, విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయకపోవడంతో నష్ట పోతున్నారు. ఎనిమిదవ సంస్కరణ-ఇంగ్లీషులో ప్రావీణ్యత పేరుతో డిజిటల్, ఆన్‌లైన్, ఐ.ఎ.ఎఫ్.పి, 8వ తరగతి నుండి టాబ్‌లు పంపిణీ చేయడం, 3వ తరగతి నుండి టోఫెల్ పరీక్షలు నిర్వహించడం వంటివి అసలు చదువు కంటే వారి ఆలోచనలను పక్కదోవ పట్టించాయి.

ఆందోళన కలిగించే గణాంకాలు

ఈ సంస్కరణల అమలుతో 1 నుండి 10వ తరగతి వరకు లక్షల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో పెరగవలసిన నమోదు తగ్గిపోతున్నది. తాజాగా 2024 మే 29 నాటి గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 11 వేలకు పైగా అయ్యాయి. 22 వేలకు పైగా బడుల్లో 50 మంది కంటే తక్కువ మంది పిల్లలు ఉన్నారు. పదవ తరగతి లోపు చదువు మానేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇది 2020-21లో 16.73 శాతం, 2021-22లో 16.29 శాతంగా వుంది. ఇది ప్రాథమికోన్నత పాఠశాలల్లో కూడా వరుసగా 0.52 శాతం, 1.62 శాతంగా ఉంది. ఆందోళన ఏమిటంటే వచ్చే విద్యా సంవత్సరానికి నిధుల కోసం జరిగిన పిఎబి సమావేశంలో రాష్ట్రం ఇచ్చిన లెక్కలను కేంద్రం ప్రకటించింది. ఇవే సంస్కరణలు అమలు జరిగితే రాబాయే 4 సంవత్సరాలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉందని ఒక అంచనా.

ఉపాధ్యాయులకు పెరిగిన పని భారం

గడిచిన అయిదేళ్లలో ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర పనుల భారం పెరిగింది. దీనిని కూడా సంస్కరణలలో భాగంగానే చూడవచ్చు. కరోనా కాలం నుంచి ఈ ఏడాది వరకు టీచర్లతో చదువులు చెప్పించే పరిస్థితులకు ఆటంకాలు కల్పించారు. కోవిడ్ కాలంలో డ్యూటీలు, ఆ కాలంలోనే నాడు-నేడు నిర్మాణ పనులు, 24 రకాల యాప్‌లను నిరంతరం అప్‌లోడ్ చేసే పనులు, పాఠశాల సమయంలోనే ఆన్‌లైన్ కార్యక్రమాల రిపోర్టులు, ఫేషియల్ యాప్‌లు, డిజిటల్, స్మార్ట్ వంటి కార్యకలాపాలు వంటివి టీచర్లకు భారంగా మారాయి. ఈ పరిస్థితుల నుంచి బయట పడటానికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసే వారి సంఖ్య పెరిగింది. ఇప్పటికీ ఇది కొనసాగుతున్నది. ఇది టీచర్లను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నది. నూతనంగా అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం టీచర్లను బోధనకే పరిమితం చేస్తామని అనేక సందర్భాలలో ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్యను అందివ్వాలంటే అనవసర పని భారాన్ని తగ్గించి యునెస్కో లక్ష్యాలను అనుగుణంగా ఉపాధ్యాయులను గౌరవించాల్సి వుంది.

ఎన్‌ఇపి అమలు తరువాత పరిస్థితులు

రాష్ట్రంలో 117 జీ.ఓ అమలు చేసి, తరగతులను విలీనం చేయడం వలన జరిగే నష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలలు కళకళలాడే స్థితి నుంచి కళా విహీనంగా మారిపోయాయి. ఒక్క విద్యార్థి కూడా చేరని పాఠశాలలు 6,500, ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్న బడులు 158, ముగ్గురు ఉన్న బడులు 290, ఒక్క విద్యార్థి ఉన్న బడులు 73. మూతబడిన పాఠశాలలు 5921. దాదాపు 4,200 పై చిలుకు బడులను విలీనం చేశారు. 3,4,5 తరగతుల విలీనం తరువాత ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. అన్నదమ్ములను, అక్కచెల్లెళ్లను విడదీయడంతో ఆ పిల్లలు ఆందోళనకు గురి అయ్యారు. అటువంటి పరిస్థితులకు కారణమైన 117 జీ.ఓ, 172 జీ.ఓ లను రద్దు చేసి రాష్ట్ర విద్యా రంగాన్ని రక్షించాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉంది. విద్యా రంగంలో నష్టదాయక సంస్కరణలు ఆగాలంటే ఎన్‌ఇపి-2020ని ఆపాలి.

**/ వ్యాసకర్త యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
సెల్ : 8985383255 /**

దేశానికి నీట్ అవసరం లేదు : విజయ్



చెన్నై : నీట్ పరీక్ష అవకతవకలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయంపై మోడీ ప్రభుత్వంపై ప్రశ్నలు ముంచెత్తుతున్న సంగతి తెలిసిందే. ఆ నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని స్టాలిన్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సినీ నటుడు, తమిళనాడు వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడైన విజయ్ నీట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి నీట్ అవసరం లేదన్నారు. ఇటీవల జరిగిన పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో వివిధ జిల్లాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఉపకార వేతనాల ప్రదానోత్సవ కార్యక్రమంలో విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నీట్ పరీక్షపై ప్రజలకు నమ్మకం పోయింది. దేశానికి నీట్ అవసరం లేదు. నీట్ నుంచి మినహాయింపు ఒక్కటే దీనికి పరిష్కారం. నీట్‌కి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నాను. తమిళనాడు ప్రజల భావోద్వేగాలను గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితా కిందకు తీసుకురావాలి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక ఉమ్మడి జాబితాను రూపొందించడానికి రాజ్యాంగాన్ని సవరించాలి. దానికింద విద్య, ఆరోగ్యాన్ని చేర్చాలి' అని ఆయన అన్నారు.

ఆక్వా రైతులు పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఆక్వా రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రాసెసింగ్ యూనిట్లు, సీడ్, ఫీడ్ కంపెనీలు నెరవేర్చడానికి ముందుకు రావడం లేదని, దీంతో ఆక్వా రైతులు సమైక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని ఆల్ ఇండియా భారత్ ఆక్వా రైతు సంఘం రాష్ట్ర సమావేశం పిలుపునిచ్చింది. ఈ మేరకు పాలకొల్లు ఎస్-ఎస్ఎస్ కళ్యాణ మండపంలో గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షతన బుధవారం వివిధ జిల్లాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆక్వా రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం వస్తున్నా ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును తదుపరి అభినందిస్తున్నారు, సిఎం చంద్రబాబును కలిసి తమ గోడు వినిపించాలని నిర్ణయించారు. అవసరమైతే క్రాప్ హాలిడేకు సిద్ధం అని హెచ్చరించారు. రైతులు ఏటా నష్టాల ఊబిలో కూరుకుపోతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గుజరాత్ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రాష్ట్రంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి బోనం చినబాబు, ఉపాధ్యక్షులు కోడి విజయభాస్కర్, మేడిది జాన్ రాజు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కర్నేన గౌరునాయుడు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పంట రుణాల టార్గెట్ ఏదీ!

- కొత్త ప్రభుత్వంపై కౌలురైతులు గంపెడాశలు
- కౌలురైతులకు పంట రుణాల మంజూరుపై చర్యలు కరువు
- బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిపి టార్గెట్లు ఇచ్చేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో బ్యాంకర్లకు టార్గెట్ విధించి కొత్త ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కౌలు రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది, కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న పరిస్థితి నెలకొంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉండగా, వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా కౌలు రైతులు ఉన్న జిల్లాలు ఇవే. తాము అధికారంలోకి వస్తే ప్రతి కౌలు రైతులకు న్యాయం చేస్తామంటూ టిడిపి కూటమి హామీ ఇచ్చింది. దీంతో కౌలు రైతులంతా కూటమి అభ్యర్థులకు ఓట్లేసి జిల్లాలో అన్ని సీట్లు కట్టబెట్టారు. అంతేకాకుండా డిప్యూటీ సిఎం, జనసేన అధినాయకుడు పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో ఎక్కువగా కౌలురైతుల గురించి మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు పండక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు పవన్‌కల్యాణ్ తన సొంత సొమ్ములు వెచ్చించి ఆర్థిక సాయం అందించడం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆయనే ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉండడంతో కౌలు రైతులు మరిన్ని ఆశలు పెట్టుకున్న పరిస్థితి ఉంది. ఏటా బ్యాంకర్ల కమిటీ సమావేశం పెట్టి ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు ఎంత మేర మంజూరు చేయాలి. కౌలు రైతులకు ఎన్ని రూ. కోట్ల రుణాలు ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం టార్గెట్లు పెడుతుండడం జరుగుతోంది. ఇప్పటివరకూ రెండు జిల్లాల్లోనూ కౌలు రైతులకు ఈ ఏడాది ఇచ్చే పంట రుణాలపై టార్గెట్లు విధించిన పరిస్థితి లేకుండా పోయింది. 2014-2019 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వం కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రత్యేక చర్యలు తీసుకుంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలు చట్టంలో భూ యజమాని అంగీకారంతోనే కౌలు కార్డులు జారీ చేయాలని నిబంధనలు విధించింది. దీంతో కౌలు కార్డులు జారీతోపాటు, పంట రుణాల మంజూరు సైతం అంతంతమాత్రం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కౌలు కార్డులు ఇవ్వకపోవడంతో పంట రుణాలుగాని, ప్రభుత్వం అందించిన రైతు భరోసా, దెబ్బతిన్న పంటలకు సాయం, బీమా వంటివి ఏ ఒక్కటీ కౌలు రైతులకు అందలేదు. చివరికి పండించిన పంటను సైతం భూ యజమాని పేరున అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కౌలురైతుల పరిస్థితి అధ్వానంగా మారింది.

నీళ్ల పప్పు..అరకొర భోజనం

- నిధులు స్వాహా..సౌకర్యాలు నిల్-శింగనమల కెజిబివిలో అధికారుల తనిఖీలో వెలుగులోకి

ప్రజాశక్తి-శింగనమల (సత్యసాయి జిల్లా)

నీళ్ల పప్పు.. అరకొర భోజనం.. మజ్జిగ అసలే లేదు.. అసౌకర్యాల నడుమ చదువులు.. ఇదీ శింగనమల మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో పరిస్థితి... ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు కనిపించడంతో అధికారులు అవాక్కయ్యారు. స్వయానా మండల కేంద్రంలో ఉంటే పాఠశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మండలంలోని వివిధ పాఠశాలలో పరిస్థితులు ఎలా ఉంటాయని స్థానికులు వాపోయారు.

మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను తహశీల్దార్ శోభన్‌బాబు, ఎంపిడిఒ రమణ, ఎంఇఒలు నరసింహరాజు, శివప్రసాద్, తదితరులు బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అధికారులు విస్తుపోయే వాస్తవాలు కనిపించాయి. మధ్యాహ్నం భోజనం నాణ్యత లేకుండా, నీళ్ల పప్పు, మజ్జిగ లేకుండా అరకొర భోజనం విద్యార్థినులకు వడ్డించడం గమనించారు. స్వయంగా అధికారులు భోజనం తిని చూడటంతో నాణ్యతగా లేనందున కేజీబీవీ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టకపోతే ఎలా అని నిలదీశారు. ఎస్ఒ లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించగా ట్రైనింగ్ లో ఉందంటూ సమాధానం ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఎస్ఒ ఏమయ్యారని నిలదీశారు. పప్పు, మజ్జిగ కచ్చితంగా ఇవ్వాల్సిందిపోయి నిధులను స్వాహా చేస్తున్నారా? అంటూ మండిపడ్డారు. పిల్లల కడుపు మీద కొడితే సహించేది లేదంటూ హెచ్చరించారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా అటెండెన్స్, రికార్డులు, ఆన్‌లైన్‌లోని వివరాలకు తేడాలు ఉండటంతో ఉన్నతాధికారులకు నివేదించారు. ఇప్పటికైనా ఇన్‌ఛార్జి ఎస్ఒ స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏలూరులో వందేభారత్‌కు హాల్ట్ ఇవ్వాలి

- రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు ఛైర్మన్ జయవర్మసిన్హాకు ఎంపి మహేష్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైళ్లకు హాల్ట్ (నిలిపేందుకు) అనుమతి ఇవ్వాలని, భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు ఛైర్మన్ సిఇఒ జయవర్మసిన్హాకు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ బుధవారం వినతిపత్రం అందించారు. జయవర్మసిన్హాను న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఏలూరు ప్రజల సౌకర్యార్థం వారి ఆకాంక్ష మేరకు సికింద్రాబాద్ నుంచి వైజాగ్ (వయా విజయవాడ) వెళ్లే వందే భరత్ రైలు ఏలూరు రైల్వే స్టేషన్‌లో హాల్ట్ (నిలిపేందుకు) అనుమతిని కోరుతూ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. జయవర్మసిన్హా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వారు త్వరలో ఏలూరులో వందే భారత్ రైలు నిలిపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. 2012లో మంజూరైన 53 కిలోమీటర్ల పొడవైన భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్‌తో హైదరాబాద్ - విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయం రెండు గంటలు తగ్గుతుందని జయవర్మ సిన్హాకు చెప్పామని తెలిపారు. ఈ లైన్ పూర్తయితే ఏలూరు జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని, ఆ పనులు వేగవంతం చేయాలని కోరగా త్వరలో పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

తక్కువ బరువుతో శిశువులు



- కోవిడ్ సమయంలో ఇలా జన్మించిన చిన్నారులు 3 శాతం కంటే ఎక్కువే
- కొత్త అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : కోవిడ్ -19 మహమ్మారి సమయంలో భారతదేశంలో తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంఖ్య బాగా పెరిగింది. సుమారు మూడు శాతం కంటే ఎక్కువ మంది పిల్లల జననం ఇలాగే జరిగిందని నూతన అధ్యయనంలో వెల్లడైంది. మహమ్మారి సమయంలో జన్మించిన పిల్లలు పుట్టినప్పుడు తక్కువ బరువు కలిగి ఉండే ప్రమాదం రెండింతలు ఉన్నట్టు ఈ అధ్యయనం కనుగొన్నది. తక్కువ బరువుతో జన్మించిన పిల్లల పెరుగుదల దీర్ఘకాలికంగా ప్రభావాన్ని చూపుతుందని అభివృద్ధి, గ్లోబల్ హెల్త్ ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ యూనివర్శిటీ ఆఫ్ నోట్రే డామ్ సంతోష్ కుమార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తక్కువ బరువుతో పుడుతున్నారు. దీనిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 2.5 కిలోగ్రాముల కంటే తక్కువ అని నిర్వచించింది. కమ్యూ నికేషన్స్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. ఈ శిశువులలో 95 శాతం మంది తక్కువ, మధ్య-ఆదాయ దేశాలలో, సగం మంది దక్షిణాసియాలో జన్మిం చారు. ఈ అధ్యయనం ప్రకారం.. ఏప్రిల్ 2020- ఏప్రిల్ 2021 మధ్య జన్మించిన పిల్లలు మహమ్మారికి ముందు జన్మించిన వారితో పోలిస్తే డబ్ల్యూహెచ్ఓ నిర్వచించిన పరిమితి కంటే తక్కువ బరువు కలిగి ఉన్నారు. రెండు లక్షల మంది శిశువులను విశ్లేషించగా.. అందులో 12,000 మంది మహమ్మారి సమయంలో జన్మించారు. 1,92,000 మంది మహమ్మారికి ముందు జన్మించారు. 2019-2021లో నిర్వహించిన ఇండియన్ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) నుంచి సమాచారం సేకరించారు. సగటున, మహమ్మారి సంవత్సరాలలో జనన బరువులు 11 గ్రాములు తగ్గినట్టు కనుగొనబడింది.

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలలో గణనీయమైన సంఖ్యలో మహమ్మారి-ప్రభావిత పిల్లలను గమనించినప్పటికీ, ధనిక కుటుంబాల నుంచి పెద్ద సంఖ్యలో పిల్లలు కూడా ప్రభావితమయ్యారని పరిశోధకులు కనుగొన్నారు. కోవిడ్ సమయంలో భౌతిక దూరానికి సంబంధించిన ఒత్తిడి, ఆర్థిక సమస్యలు మాతా-నవజాత శిశువుల సంరక్షణకు అంతరాయం కలిగించాయి. మహమ్మారికి సంబంధించిన అనేక అంశాలు గర్భిణీ స్త్రీల ఆరోగ్య ప్రవర్తనలను ప్రభావితం చేసి, శిశువులు తక్కువ బరువుతో జన్మించటానికి దారి తీసి ఉండవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.



చీనీ చెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ

చీనీ చెట్లు నరికివేత


ప్రజాశక్తి - బత్తలపల్లి (సత్యసాయి జిల్లా)

సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని యర్రాయపల్లి గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరుడు అన్నగిరి శివారెడ్డికి చెందిన 66 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నరికివేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, శివారెడ్డికి చెందిన మూడు ఎకరాల పొలంలో రూ. 5లక్షలు పెట్టుబడి పెట్టి 430 చీనీ చెట్లను సాగుచేశారు. అందులో అంతరపంటగా టమోటా, కనకాంబరాలు సాగు చేసుకున్నారు. ఏడాది వయస్సున్న చీనీ చెట్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన శివారెడ్డి తల్లి రామలింగమ్మ అక్కడ నేలకూలిన చీనీచెట్లను చూసి కుమారుడికి సమాచారమిచ్చారు. శివారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవించే తమకు ఎవరితోనూ గొడవలు లేవని, శత్రుత్వం కూడా లేదని బాధితులు వాపోయారు. ఎవరు ఎందుకు చేశారో అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మన్యానికి మలేరియా

- రోగులతో ఆస్పత్రులు కిటకిట

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)



ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు చొప్పున చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మన్యానికి మలేరియా పట్టింది. వైద్యం కోసం వస్తున్న విద్యార్థులు, గిరిజన రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో రోజువారి ఒపి 200కు చేరువైంది. వర్షాకాలం ప్రారంభంలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. భద్రగిరి ఆస్పత్రిలో మంచాలు చాలక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా మందులు లేక చాలామంది ప్రయివేటు వైద్యంపై ఆధారపడుతున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు తప్పనిసరి పరిస్థితిలో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. పెరుగుతున్న రోగుల దృష్ట్యా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి మలేరియా మందులు అందుబాటులో ఉంచాలని, సేవలను మెరుగు పరచాలని, గ్రామాల్లో మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

సురక్షిత విమానయానమే లక్ష్యం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సురక్షితమైన విమానయాన సేవలు అందించడమే లక్ష్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఢిల్లీలో పౌర విమానయాన శాఖ ఉన్నతస్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల భద్రత, ఆధునిక సాంకేతిక వినియోగం, హైజాకింగ్ వ్యతిరేక చర్యల బలోపేతం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బిసిఎఎస్ డైరెక్టర్ జనరల్ జుల్ఫిర్ హసన్, ఎంఒసిపిఎ కార్యదర్శి ఉల్మున్‌మంగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎవరీ భోలే బాబా?


- లెక్కలేనని లైంగిక వేధింపుల కేసులు జైలుకెళ్లి వచ్చాడు
- బిజెపి నేతలతో సన్నిహిత సంబంధాలు!



లక్నో: యుపిలోని హత్రాస్‌లో 130 మంది ప్రాణాలు బలిగొన్న భోలే బాబా అసలు బండారం బయటపడింది. బాబా ముసుగులో ఉన్న ఓ క్రిమినల్ అని ఆతని గత చరిత్ర చూస్తే అర్థమవుతుంది. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి అతనిపై యుపిలోనే కాకుండా, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా అనేక కేసులున్నాయి. కొన్ని కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. అయినా, తనకు తాను మత గురువుగా అతను ప్రచారం చేసుకుంటూ, చెలామణి అవుతున్నాడు. బహదూర్ నగర్‌కు చెందిన సూరజ్ పాల్ అనే ఈ వ్యక్తి 1977లో ఓ లైంగిక వేధింపుల కేసులో జైలుకెళ్లాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత 'సాకర్ బిస్వా హరి బాబా' అన్న పేరుతో కొత్త అవతారమెత్తాడు. తన గ్రామంలో ఒక ఆశ్రమాన్ని నెలకొల్పి 'భోలేబాబా' గా తనకు తాను ప్రకటించుకున్నాడు. తనను ప్రమోట్ చేసేందుకు వంది మాగధుల బృందాన్ని ఒక దానిని ఏర్పాటు చేసుకున్నాడు. బాబా పాద ధూళి తాకితే సకల పాపాలు హరించుకుపోతాయని ఈ ముఠా ప్రచారం చేస్తూ జనాన్ని పెద్దయెత్తున సమీకరించింది. బాబా వచ్చేవరకు ఎవరూ సత్సంగ్ స్థలి నుంచి కదల కూడదని ఫత్వా కూడా జారీ చేశారు. బాబా కారు నుంచి దిగ గానే అతని పాదాలను తాకడం కోసం అమాయక జనం పోటీ పడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో పెద్ద యెత్తున జనం చనిపోయి, శవాలు గుట్టలుగుట్టలుగా పడి ఉంటే బాబాకు ఏమీ పట్టలేదు. గుట్టు చప్పుడు కాకుండా కారెక్కి ఉడాయించాడు. బాబా అవతారమెత్తక ముందు పద్దెనిమిది సంవత్సరాల పాటు యుపిలో పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేశాడు. ఇంటెలిజెన్స్ ఏజెన్సీని వదిలేసి మత గురువుగా మారి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించాడు. బిజెపి అగ్ర నాయకత్వంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నట్లు వార్తలొస్తున్నాయి.

ఉసురు తీస్తున్న పోటీ పరీక్షలు

ఆత్మహత్యలకు రాజధానిగా మారుతున్న భారత్
ఒత్తిడి, ఆందోళనతో బలవన్మరణాలు
విద్యార్థులను కుంగదీస్తున్న మానసిక అనారోగ్యం
అగ్నికి ఆజ్యం పోస్తున్న కోచింగ్ కేంద్రాలు



న్యూఢిల్లీ : విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకే జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. కానీ దురదృష్టవశాత్తూ ఈ పరీక్షలు యువతలో ఒత్తిడికి, ఆందోళనకు, మానసిక ఆరోగ్య సంబంధమైన సమస్యలకు దారితీస్తున్నాయి. నీట్ వివాదానికి సంబంధించి ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. వైద్య శాస్త్రాన్ని అభ్యసించాలని కలలు కంటున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది. ఇది చాలదన్నట్లు ఉమ్మడి యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ) ఫలితాలను ప్రకటించడంలో జరుగుతున్న జాప్యం ఆందోళనను మరింత పెంచుతోంది.

చాలా మంది విద్యార్థులు 14-15 సంవత్సరాల వయసులోనే వేర్వేరు పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు. ఎందుకంటే వీటిలో పోటీ చాలా అధికంగా ఉంటుంది. విజేతగా నిలవాలంటే రాత్రింబవళ్లు కష్టపడాల్సిందే. పేరొందిన సాంకేతిక, వైద్య కళాశాలలు, యూనివర్సిటీలలో సీటు సంపాదించుకోవాలంటూ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి తెస్తుంటారు. పరీక్షలో విఫలమైతే తల్లిదండ్రుల ఆశలు అడియాసలవుతాయేమోనని యువ విద్యార్థులు భయపడుతుంటారు. దీంతో వారంతా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసి కోచింగ్ కేంద్రాలలో చేరుతారు. ఈ కేంద్రాలు కోచింగ్ ఇవ్వడంతో పాటు దురదృష్టవశాత్తూ విద్యార్థులపై ఒత్తిడి కూడా పెంచుతుంటాయి. గంటల తరబడి స్టడీ అవర్స్ నిర్వహిస్తాయి. చివరికి కోచింగ్ కేంద్రాలు నిర్వహించే ఇంటర్నల్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు, ర్యాంకులు పొందేందుకు విద్యార్థులు తాపత్రయపడతారు. కోచింగ్ కేంద్రం పెట్టే పరీక్షల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిస్తే ప్రతిష్టాత్మక కళాశాలలో సీటు గ్యారంటీ అనే ధీమా వారిలో కలుగుతుంది.

ఒత్తిడి పెంచుతున్న కోచింగ్ కేంద్రాలు

గత సంవత్సరం కోటాలో లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఓ సర్వే ప్రకారం 85శాతానికి పైగా విద్యార్థులు ప్రతిరోజూ ఆరు నుంచి ఏడు గంటల పాటు కోచింగ్ కేంద్రాలలోనే గడుపుతున్నారు. కొందరు ఎనిమిది గంటల వరకూ అక్కడే ఉండి కోచింగ్ తీసుకుంటున్నారు. ఈ ఒత్తిడిని తగ్గించుకునేందుకు వారానికి కనీసం ఒక రోజైనా విశ్రాంతి కావాలని 80శాతం మంది కోరుకుంటున్నారు. కొందరు విద్యార్థులైతే కోటాలో ప్రవేశించగానే ఒంటరితనాన్ని ఫీలవుతారు. వారిలో అలసట, కోపం, విచారం, నిరాశ వంటి లక్షణాలు కలగలిసి ఉంటున్నాయి. చాలా మంది విద్యార్థులు రాత్రి బాగా పొద్దుపోయాక నిద్రపోతారు. సరైన విశ్రాంతి లభించక మానసిక ఒత్తిడికి గురవుతారు. కోచింగ్ కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా, ఇతర సెంటర్లతో పోటీ పడి అధిక ర్యాంకులు సంపాదించాలన్న కక్షపూరితంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత జటిలం చేస్తోంది.

ఆత్మహత్యల్లో మనమే నెంబర్ వన్

ప్రపంచంలో జరుగుతున్న ఆత్మహత్యలకు మన దేశమే రాజధానిగా మారుతోంది. ఏటా 2.6 లక్షల ఆత్మహత్యల కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వద్ద ఉన్న సమాచారం ప్రకారం మన దేశంలో ఆత్మహత్యల సగటు రేటు లక్ష జనాభాకు 10.9గా ఉంది.

విషాదకరమైన విషయమేమంటే మన దేశంలోనే యువత అత్యధికంగా బలవన్మరణాలకు పాల్పడుతోంది. 2020లో ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తెలిపింది. అంటే రోజుకు 34 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారన్న మాట. ఆ సంవత్సరంలో 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న 11,396 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2021లో 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అంటే రోజుకు 35 మందికి పైగా చనిపోయారన్న మాట. 2020లో నమోదైన 12,526 కేసులతో పోలిస్తే ఇది 4.5% ఎక్కువ. పరీక్షల్లో ఫెయిలైన కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది.

ఆందోళనకరంగా విద్యార్థుల ఆత్మహత్యల రేటు

విద్యార్థుల్లో ఆత్మహత్యల రేటు ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం 2022లో 13 వేల మందికి పైగా విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ సంవత్సరం నమోదైన మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థులవే 7.6శాతం ఉండడం గమనార్హం. సెకండరీ స్థాయి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులే (మొత్తం ఆత్మహత్యల్లో 23.9శాతం) ఎక్కువగా ప్రాణాలు తీసుకుంటున్నారని ఈ నివేదిక తెలిపింది. తెలంగాణలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడిన వెంటనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. 2019లో కూడా ఇంటర్ ఫలితాలు ప్రకటించిన తర్వాత 22 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అందించిన సమాచారం ప్రకారం 2014-21 మధ్యకాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర యూనివర్సిటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన 122 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ముఖ్యంగా కోటాలో చదువుతున్న విద్యార్థుల్లో ఆత్మహత్యలు పెరగడం ప్రభుత్వాన్ని, విద్యార్థులు, తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

మానసిక వైద్యుల కొరత

విద్యార్థులు నిరాశానిస్పృహలకు లోనుకాకుండా చూసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు తరగతి గదిలో ర్యాంకుల వారీగా కాకుండా అక్షర క్రమంలో కూర్చునేలా చేయడం వీటిలో ముఖ్యమైనది. దీనివల్ల యువతలో అనారోగ్యకరమైన పోటీ, ఒత్తిడి తగ్గుతాయి. విద్యార్థుల్లో తలెత్తుతున్న మానసిక ఆరోగ్య సంక్షోభం కూడా ఆందోళన కలిగించే అంశమే. దీని ఎదుర్కోవడం సవాలుగా మారుతోంది. మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే సైక్రియాట్రిస్టులు, సైకాలజిస్టులు, సామాజిక కార్యకర్తల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ప్రతి లక్ష మంది జనాభాకు 0.3 మంది సైక్రియాట్రిస్టులు, 0.07 మంది సైకాలజిస్టులు, 0.07 మంది సామాజిక కార్యకర్తలు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి లక్ష మందికి 6.6 మంది సైక్రియాట్రిస్టులు సేవలు అందిస్తున్నారు. ప్రపంచంలోని ప్రతి లక్ష మంది జనాభాకు సగటున మానసిక చికిత్స అందించే ఆస్పత్రులు 0.04 ఉంటే మన దేశంలో మాత్రం 0.004 మాత్రమే ఉన్నాయి.

ఏం చేయాలంటే...

విద్యార్థుల ప్రవర్తనలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం గమనిస్తూ వారితో చర్చించి సమస్యలు తెలుసుకుంటే ఆత్మహత్యలను చాలా వరకూ నివారించవచ్చు. పిల్లలు కేవలం విద్యకే పరిమితం కాకుండా పాటలు పాడడం, నృత్యం చేయడం, పెయింటింగ్స్ వేయడం, రాయడం, చదవడం, వంట చేయడం వంటి ఇతర పనులు కూడా నేర్చుకునేలా ప్రోత్సహించాల్సి ఉంది. దీనివల్ల వారిలో ఒత్తిడిని తగ్గించవచ్చు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఓ యంత్రాంగాన్ని రూపొందించాలి. ముఖ్యంగా తాము ఒంటరివారం కామని, బంధువులు, స్నేహితులు ఎల్లవేళలా తమకు అండగా ఉంటారని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావని విద్యార్థులు భావించిన రోజు సమస్యలే ఉండవు.

ప్రకాశంలో మిర్చి వ్యాపారి కిడ్నాప్ !

బకాయిల కోసం చేసివుంటారని అనుమానం

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

బకాయిలు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు మిర్చి వ్యాపారిని కిడ్నాప్ చేశారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిరుదుల నరవ గ్రామానికి చెందిన రావి వెంకటరెడ్డి గుంటూరులోని మిర్చి యార్డులో కమిషన్ ఏజెంట్ వ్యాపారం చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత రైతులు ఎక్కువ మంది వెంకటరెడ్డిని ఆశ్రయించేవారు.


రావి వెంకటరెడ్డి

రైతులతో ఉన్న పరిచయాల నేపథ్యంలో మిర్చి అమ్మగా వచ్చిన డబ్బులను తర్వాత ఇస్తానంటూ వెంకటరెడ్డి దాటవేసేవారు. మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని రైతులకు సుమారు రూ.10 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్రామ రైతులకే రూ.2 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని సమాచారం. బకాయిలు చెల్లించాలని చాలా కాలంగా రైతులు ఒత్తిడి చేసినా ఫలితం లేకపోయింది. గతంలోనూ ఇదే విషయంపై పోలీసులను ఆశ్రయించినా రైతులకు న్యాయం జరగలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు మిర్చి వ్యాపారి వెంకటరెడ్డిని నిలదీశారు. తమకు రావాల్సిన పైకం చెల్లించాల్సిందేనని ఒత్తిడి చేశారు. మాటామాటా పెరగడంతో వ్యాపారిపై దాడి చేశారు. అనంతరం ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తీసుకెళ్లారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మార్కాపురం రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్, పోలీస్ బృందాలతో గాలింపు చేపట్టారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు డిజిపి అభినందన

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

వృత్తి నైపుణ్యంలో దేశవ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్ర పోలీసులను డిజిపి ద్వారకా తిరుమలరావు బుధవారం అభినందించారు. అస్సోంలోని గౌహతీలో జూన్ 24 నుండి 30 వరకు జరిగిన ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2024లో రాష్ట్ర పోలీసులకు తొమ్మిది అంశాల్లో మెడల్స్ వచ్చాయి. ఇందులో ఒక గోల్డ్, రెండు సిల్వర్, ఆరు రజతం పతకాలను రాష్ట్ర పోలీసులు సాధించారు. దేశంలోని 24 రాష్ట్రాలతోపాటు ఐదు కేంద్ర పాలిత ప్రాంతాలు, 11 కేంద్ర సాయుధ బలగాలకు చెందిన దాదాపు రెండు వేల మంది పోలీసులు 40 టీమ్‌లుగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్పోర్ట్స్ ఐజి కెవి మోహన్‌రావు నేతృత్వంలో రాష్ట్ర పోలీసులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులను మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో డిజిపి అభినందించారు.

మాతృ సంస్థలకు వెళ్లాలనుకున్న అధికారులకు చుక్కెదురు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గత ప్రభుత్వంలో ఒక వెలుగువెలిగి వివాదాస్పద అధికారులుగా ముద్ర పడ్డ అధికారులను తిరిగి కేంద్రంలోని మాతృ సంస్థల్లోకి చేరేందుకు వెళ్లిన వారికి చుక్కెదురైంది. రాష్ట్ర సమాచారశాఖ కమిషనరు తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి, గనులశాఖ ఎమ్‌డి విజి వెంకటరెడ్డి, ఎపి బేవరేజ్ కార్పొరేషన్ ఎమ్‌డి వాసుదేవరెడ్డి వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర సర్వీసుల నుండి రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చారు. వీరు తమ డిప్యూటేషన్ ముగిసినా మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందనే అంచనాతో డిప్యూటేషన్‌ను పొడిగించుకున్నారు. అయితే రాష్ట్రంలో వైసిపి ఓటమి చెందడం, టిడిపి అధికారంలోకి వచ్చాక ఆ అధికారులు తీసుకున్న నిర్ణయాలపై విచారణను జరుపుతుండటంతో వీరు తిరిగి కేంద్ర సర్వీసుల్లోని తమ మాతృ శాఖలకు వెళ్లేందుకు చేసిన యత్నాలకు కేంద్రం గండికొట్టింది. వారిని తిరిగి సర్వీసుల్లోకి తీసుకునేందుకు నిరాకరించింది.

విద్యార్థులను మోసం చేసిన జగన్

- **టిడిపి నేత విజయకుమార్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన హయాంలో 9,64,066 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా మోసం చేశారని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చిన 19 రోజుల్లో ఫీజులు కట్టాలని జగన్, ఆయన పేపర్ ఎలా అడుగుతారని ప్రశ్నించారు. అస్మదీయ కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించిన జగన్... పిల్లల ఫీజులు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. విద్యావసతి రూ.1,200 కోట్లు, మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు బాకీ పెట్టారని ప్రశ్నించారు. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ దశలవారీ ఫీజులన్నీ చెల్లిస్తామని పేర్కొన్నారు.

కట్టు కథలు, బురద చల్లే యత్నాలకు సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : ఇటీవల సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం జరిగిన నేపథ్యంలో ఆ సమావేశం గురించి పూర్తిగా కల్పితమైన వార్తలను మలయాళీ మీడియాలోని ఒక సెక్షన్ ప్రచురించడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. పొలిట్‌బ్యూరో బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. తాజాగా వండివార్చిన ఈ కథనాల్లో వారు (మీడియాలో ఒక సెక్షన్) తమ అభిప్రాయాలను సభ్యుని నోట్లో కుక్కేందుకు యత్నించారు. పార్టీ రాజకీయ పంథాను ఒక సభ్యుడు విమర్శించారని, పార్టీ ప్రధాన కార్యదర్శిపైనా ఆరోపణలు గుప్పించారనేది ఆ కట్టుకథల సారాంశం. వాస్తవానికి ఆ సభ్యుడు చర్చలోనే పాల్గొనలేదు. పార్టీ శ్రేణుల్లోను, కేరళలోని పార్టీ అభిమానుల్లోను గందరగోళాన్ని సృష్టించడమే వారి ఉద్దేశమని స్పష్టమవుతున్నది. ఇటువంటి కుయుక్తులు ఎప్పటికీ ఫలించబోవు. వాస్తవానికి, ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరుపై కేంద్ర కమిటీ కూలంకషంగా సమీక్షించి, ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిందని పొలిట్‌బ్యూరో తెలిపింది. కేరళ రాష్ట్ర కమిటీ నిర్వహించిన సమీక్షలో ప్రధాన అంశాలను కూడా ఈ తీర్మానంలో పొందుపరిచామని ఆ ప్రకటన పేర్కొంది. ప్రస్తుత ఈ సవాళ్ళను పార్టీ కలిసికట్టుగా ఎదుర్కొంటుందని పొలిట్‌బ్యూరో ఉద్ఘాటించింది.

రేపు ఎంపిగా అమృత్‌పాల్ సింగ్ ప్రమాణం

న్యూఢిల్లీ : ఖలిస్థానీ నేత, వారిస్ పంజాబ్ దే నాయకుడు అమృత్‌పాల్ సింగ్ శుక్రవారం ఎంపిగా ప్రమాణీస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఫరీద్‌కోట ఎంపీ సరభ్‌జీత్ సింగ్ ఖల్సా మీడియాకు వెల్లడించారు. తాను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో మాట్లాడానని ఖల్సా చెప్పారు. జులై 5న స్పీకర్ ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం ఉండనుందని తెలిపారు. దీనికి సంబంధించి అమృత్‌పాల్‌కు ఐదవ తేదీ నుంచి నాలుగురోజులకు పేరోల్ లభించినట్లు చెప్పారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖడూర్ సాహిబ్ స్థానం నుంచి అమృత్‌పాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అయితే జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయిన సింగ్ ప్రస్తుతం అస్సాంలోని డిబ్రూగఢ్‌లో జైల్లో ఉన్నారు. కాగా, శుక్రవారం ఉగ్రనిధుల కేసు కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్‌లో ఉన్న బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ ప్రమాణ స్వీకారం కూడా ఉండనుంది.

మహారాష్ట్రలో జికా వైరస్ కలకం

రాష్ట్రాలకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో జికా వైరస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. పూణెలో ఇద్దరు గర్భిణీలు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ అని తేలిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జికా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. 'ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు అప్రమత్తంగా ఉండాలి. వారికి నిరంతరం పరీక్షలు నిర్వహించాలి. ఈ వైరస్ పాజిటివ్‌గా పరీక్షించిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించాలి. వారిపట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలి' అని తెలిపింది. అలాగే ఈ వైరస్‌కు గురైన బాధిత గర్భిణీ స్త్రీ పిండంలో జికా మైక్రోసెఫాలీ నాడీ సంబంధిత పరిణామాలతో సంబంధం కలిగి ఉన్నందున, పర్యవేక్షణ కోసం వైద్యులను అప్రమత్తం చేయాలని సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు,ఆరోగ్య సౌకరాల్లో కీటకాలు లేకుండా చూడాలని, నియంత్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ఆదేశించింది. అలాగే, ఈ వైరస్ పట్ల ప్రజల్లో భయాందోళనలను తగ్గించడానికి, అవగాహన కల్పించడానికి ముందు జాగ్రత్తగా సందేశాలు పంపాలని కోరింది.

భోలే బాబా పరార్!

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలోనే భోలే బాబా తన కారులో సత్సంగ్ ప్రదేశాన్ని వదిలి పరారయ్యారు. రోడ్డుకు ఆవలి వైపున ఉన్న పొలాల వైపు జనం పరుగులు తీశారని, అయితే అదంతా నీరు, బురదతో నిండి ఉన్నదని, వాలంటీర్లు లాఠీలతో ప్రజలను చెదరగొట్టారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా వారికి నిర్వాహకులు, వాలంటీర్ల నుండి ఎలాంటి సాయం లభించలేదు.
అంతేకాదు...తొక్కిసలాట ఫలితంగా చెల్లాచెదురుగా పడిపోయిన బూట్లు, చెప్పులు, ఇతర సామగ్రిని వాలంటీర్లు సమీపంలోని పొలంలోకి విసిరేశారు. ఇప్పటి వరకూ నిర్వాహకులు పోలీసులకు ఎలాంటి సమాచారం అందించకపోవడం గమనార్హం.


అమరావతిని పునర్నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఏ ఒక్కరికోసమో కాదని, దీనివల్ల రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఉండేవారందరికీ ఉపాధి దొరుకుతుందని వివరించారు. ప్లాను ప్రకారం నిర్మాణం జరిగి ఉంటే పన్నులు, జిఎస్‌టి ఇతర రూపాల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, రూ.30 వేల కోట్లు ఖర్చుపెడితే రూ.20 వేల కోట్ల ఆదాయం వచ్చేదని అన్నారు. రాజధాని ఎక్కడ ఆగిందో అక్కడ నుండే పనులు ప్రారంభిస్తామని చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్

- నేడు ప్రమాణస్వీకారం?
- చంపాయి సోరెన్ రాజీనామా



రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణీస్వీకారం చేయనునున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంపాయి సోరెన్ నివాసంలో బుధవారం సమావేశమైన జెఎంఎం, ఇండియా వేదిక ఎమ్మెల్యేలు తమ నాయకుడిగా హేమంత్ సోరెన్‌ను ఎనుకొన్నారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు తనకు అవకాశం ఇవ్వాలని గవర్నర్ రాధాకృష్ణన్‌ను హేమంత్ సోరెన్‌ను అభ్యర్థించారు. హేమంత్‌సోరెన్‌ను గురువారం ప్రమాణీస్వీకారానికి గవర్నర్ ఆహ్వానించే అవకాశం ఉందని సమారం. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఇడి అధికారులు అప్పటి సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడంతో చంపాయి సోరెన్ ఆ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. హేమంత్‌కు ఇటీవల రాంచీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి ఇటీవల ఆయన విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో చంపాయి సోరెన్ నివాసంలో సమావేశమైన ఎమ్మెల్యేలు హేమంత్ సోరెన్‌ను సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అలాగే, హేమంత్ రాష్ట్రానికి 13వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు వీలుగా ప్రస్తుత సీఎం చంపాయి సోరెన్ తన రాజీనామాను గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ.. జెఎంఎం కూటమి తీసుకున్న నిర్ణయం మేరకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

తమ కూటమి బలంగా ఉందని చెప్పారు. హేమంత్ విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు నాకు బాధ్యతలు అప్పగించాయి. ఇప్పుడు కూటమి హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది" అని తెలిపారు. చంపాయి సోరెన్ నివాసంలో జరిగిన సమావేశానికి జార్ఖండ్ పిసిసి అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, ఆ పార్టీ ఇన్‌చార్జ్ గులామ్ అహ్మద్ మిర్, హేమంత్ సోరెన్ భార్య కల్పనా, సోదరుడు బసంత్‌లు కూడా హాజరయ్యారు.

న్యాయాన్ని అపహాస్యం చేయడమే !

- మేధా పాట్కర్‌కు జైలు శిక్షపై ఎఐకెఎస్ వ్యాఖ్య
- తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్

న్యూఢిల్లీ : నర్మదా ప్రాజెక్టు బాధితులకు న్యాయం కోసం ఉద్యమించిన మేధా పాట్కర్‌కు 23ఏళ్ళ నాటి కేసులో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల అఖిల భారత కిసాన్ సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వున్న వి.కె.సక్సేనా వేసిన పరువు నష్టం కేసులో ఆమెకు 5 నెలల జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధిస్తూ సోమవారం ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మేధా పాట్కర్‌ను అరెస్టు చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు న్యాయాన్నే అపహాస్యం చేసేలా వున్నాయని ఎఐకెఎస్ విమర్శించింది. తక్షణమే నర్మదా ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అసమ్మతి గళాన్ని ఇలా అణచివేయడం వెనుక కార్పొరేట్ శక్తులు వున్నాయని, బిజెపితో కలిసి ఈ కార్పొరేట్ శక్తులు పేదల జీవనోపాధి హక్కుల కోసం పోరాడుతున్న వారి గొంతులను నొక్కేస్తున్నారని విమర్శించింది. ఆ కార్పొరేట్ శక్తులను ఎండగట్టాలని ప్రజలను కోరింది. కల్పిత వార్తలు, సమాచారం ప్రాతిపదికగా ప్రముఖ సామాజిక కార్యకర్తను ఇలా శిక్షించడమన్నది న్యాయాన్ని ఎద్దేవా చేయడమేనని విమర్శించింది.

తమ అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో కార్పొరేట్ శక్తులు విజయం సాధించాయని ఎఐకెఎస్ వ్యాఖ్యానించింది. మేధా పాట్కర్‌కు సంఘీభావాన్ని ప్రకటించింది. నర్మదా ప్రాజెక్టు వల్ల ఇబ్బందులు పడుతున్న వేలాదిమంది బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో విఫలమయ్యాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎఐకెఎస్ విమర్శించింది. భూ సేకరణ పునరావాస చట్టాన్ని యుపిఎ ప్రభుత్వం ఆమోదించినా నర్మదా లోయలోని రైతుల, గ్రామీణ కార్మికుల నష్టపరిహారం, పునరావాసం హక్కుకు మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వాలు హామీ కల్పించలేదని విమర్శించింది.

ఇప్పటికైనా నర్మదా బాధితులకు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని ఎఐకెఎస్ గట్టిగా డిమాండ్ చేసింది. బాధితులకు ఉపాధి కల్పించాలని, పునరావాసం, రీ సెటిల్‌మెంట్ ద్వారా వారి జీవనోపాధికి మద్దతును అందచేయాలని కోరింది.

వందే భారత్‌లో వర్షపు నీరు


న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వందే భారత్ హైస్పీడ్ రైల్‌లోని సౌకర్యాలపై తరచూ ఫిర్యాదు వస్తున్నాయి. టిక్కెట్ ధర ఎక్కువైనా అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు ఉండటం లేదని ప్రయాణికుల నుంచి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. ఇటీవల కూడా ఇలాంటి సంఘటన జరిగింది. ఇటీవల కురిసిన వర్షం కారణంగా వందేభారత్ పైకప్పు నుంచి లోనికి నీరు చేరింది. న్యూఢిల్లీ నుంచి వారణాసికి బయలుదేరిన రైలులో ఈ ఘటన చోటు చేసుకొంది. వర్షం కారణంగా పైకప్పు నుంచి నీరు లోనికి చేరింది. సీట్లన్నీ తడిచిపోవడంతో ప్రయాణికులు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఏకధాటిగా నీరు పైనుంచి రావడంతో ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగింది. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ప్రయాణికుడు రైల్వే సేవలపై తన అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోకు "వందేభారత్‌లో ఇప్పటివరకు క్యాటరింగ్ సమస్యే ఉండేది. ఇక నుంచి మరో కొత్త సమస్యను ఎదుర్కోవాలి" అని ఒకరు.. "ఇకపై ప్రయాణికులు తడుస్తూ ప్రయాణించవచ్చు. ధర ఎక్కువ సేవలు తక్కువ" అని కామెంట్లు వస్తున్నాయి. ఈ ఘటనపై ఉత్తర రైల్వే స్పందించింది. నీరు లోనికి రావడానికి గల కారణాన్ని వివరించింది. "ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. నీటి పైపులు తాత్కాలికంగా మూసుకుపోవడంతోనే ఈ విధంగా జరిగింది. నీరు లోనికి చేరింది. ఇలాంటి తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం" అని ఓ ప్రకటనలో ప్రయాణికులను క్షమాపణలు కోరింది.

ఫ్రాన్స్ ఎన్నికలు

7న కీలక ఓటింగ్

- లీపెన్స్ పార్టీనా? పాపులర్ ఫ్రంటా?

పారిస్: ఈ నెల7న జరిగే రెండో రౌండ్ ఎన్నికల్లో అమీ తుమీ తేల్చుకునేందుకు మెరీన్ లీపెన్స్ నాయకత్వంలోని నేషనల్ ర్యాలీ, వామపక్ష, ప్రగతిశీల శక్తులతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ హోరా హోరీగా ప్రచారం చేస్తున్నాయి. మొదటి రౌండ్‌లో మూడింట ఒక వంతు ఓట్లతో దూకుడు మీద ఉన్న లీపెన్స్ పార్టీతో, రెండవ అతి పెద్ద శక్తిగా ఏర్పడిన న్యూ పాపులర్ ఫ్రంట్ నేరుగా ఢీకొంటుంది. పాపులర్ ఫ్రంట్‌లో భాగస్వామి అయిన 'ఫ్రాన్స్ అన్‌బౌడ్' నాయకుడు జీన్ లూస్ మెలెంచాన్ ఆదివారం పారిస్‌లో వేలాది మంది ప్రదర్శకులనుద్దేశించి మాట్లాడుతూ, ఇది ఫాసిజానికి, ప్రజాస్వామ్యానిక మధ్య జరుగుతున్న సమరం అని అన్నారు. దేశంలో నయా ఉదారవాద విధానాలను ఉధృతంగా అమలు చేసి సామాజిక న్యాయాన్ని ధ్వంసం చేసిన ఇమానియెల్ మాక్రాన్ విధానాలను తాము వెనక్కి నెడతామని చెప్పారు. గత శుక్రవారం జరిగిన మొదటి రౌండ్ ఎన్నికల్లో లీపెన్స్ నేతృత్వంలోని నేషనల్ ర్యాలీ (ఆర్‌ఎన్) కి 33.2.శాతం ఓట్లు రాగా, సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, గ్రీన్స్ పార్టీ, ఫ్రాన్స్ అన్‌బౌడ్ పార్టీలతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్)కి 28.1 శాతం , మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ కూటమికి 21 శాతం ఓట్లు వచ్చాయి. ఫ్రాన్స్



అధ్యక్ష ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా రెండు రౌండ్లలో నిర్వహించడం ఆనవాయితీ. మొదటి రౌండ్ శాంపిల్ పద్ధతిలో పరిమితంగా కొద్ది నియోజకవర్గాల్లో ఎన్నిక నిర్వహిస్తారు. కీలకమైన రెండవ రౌండ్‌లో అత్యధిక స్థానాలకు ఎన్నిక జరుగుతుంది. రాజకీయ అనిశ్చితిని నివారించాలన్నదే దీని ఉద్దేశం. మాక్రాన్ అధ్యక్ష పదవీ కాలం ఇంకా మూడేళ్లు ఉంది. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాల వల్ల ఆయన పదవికి తక్షణమే వచ్చే ప్రమాదం ఏమీ లేకున్నా, చట్టాలు చేసేటప్పుడు పార్లమెంటులో అడుగడుగునా ఆయనకు పరీక్షే. మాక్రాన్ పాలనలో కార్పొరేట్లు, బిలియనీర్ల లాభాలు 85 శాతం దాకా పెరిగాయి. అదే సమయంలో కార్మికుల నిజవేతనాలు 5శాతం వరకు పడిపోయాయి. గ్యాస్, నిత్యావసరాల ధరలు చుక్కలనంటాయి. నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చింది. ఉక్రెయిన్ యుద్ధానికి దళాలను, నిధులను అందజేస్తూ, సామాజిక సంక్షేమంపై ఎడాపెడా కోతలు పెట్టింది. దీనికి వ్యతిరేకంగా 2018-19లో పుసుపు చొక్కాల ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. మాక్రాన్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న ఈ అసంతృప్తిని ఫాసిస్టు పార్టీ నేషనల్ ర్యాలీ తనవైపు తిప్పుకునేందుకు జాతి దురహంకారాన్ని, వలసదారులకు వ్యతిరేకంగా విద్వేషాలను రెచ్చగొడుతొంది. నేషనల్ ర్యాలీని ఎట్టి పరిస్థితుల్లోను అధికారంలోకి రానీయకుండా చూసేందుకు న్యూ పాపులర్ ఫ్రంట్ తీవ్రంగా పోరాడుతోంది. తాము అధికారంలోకి వస్తే కార్మికుల కనీస వేతనాలు పెంచుతామని, పెంచిన రిట్మైర్మెంట్ వయో పరిమితిని తగ్గిస్తామని, బిలియనీర్ల లాభాలను కట్టడి చేసేందుకు సంపద పన్ను విధిస్తామని, మాక్రాన్ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలను వెనక్కి తిప్పికొడతామని, కెనడా, యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు పర్యావరణానికి తీవ్ర హానికరంగా ఉన్నందున వాటిని రద్దు చేస్తామని న్యూ పాపులర్ ఫ్రంట్ హామీ ఇచ్చింది.కార్పొరేట్ శక్తులు, బ్యాంకింగ్ రంగం లీపెన్స్ పార్టీ ఫాసిస్టు స్వభావం గురించి తెలిసి కూడా పాపులర్ ఫ్రంట్‌ను అడ్డుకోవడం కోసం ఈ శక్తులు ఆ పార్టీకి కొమ్ముకాస్తున్నాయి.

ట్రంప్‌కు శిక్షపై తీర్పు సెప్టెంబరుకు వాయిదా

వాషింగ్టన్ : మోడల్ , శృంగార తారకు డబ్బు గుమ్మరించిన కేసులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు శిక్ష విధించే తేదీని సెప్టెంబరు 18కి వాయిదా వేశారు. అధ్యక్ష అభ్యర్థికి కల్పించాల్సిన రక్షణపై సుప్రీం నిర్ణయం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యూయార్క్ న్యాయమూర్తి మంగళవారం తెలిపారు. ఈ నెల 11న ట్రంప్‌కు శిక్ష విధించాల్సి వుంది. అయితే ఇప్పుడు సెప్టెంబరు 18న మాజీ అధ్యక్షుడికి విధించే శిక్షపై నిర్ణయం తీసుకుంటామని న్యాయమూర్తి జువాన్ మెర్చన్ తెలిపారు. అప్పటికి ఇంకా ఆ అవసరముంటే ఆ చర్య తీసుకుంటామని వ్యాఖ్యానించారు. సోమవారం నాటి సుప్రీం రూలింగ్‌తో సుదూర పర్యవసానాలు వుండగలవని తెలుస్తోంది. ట్రంప్ పక్షం చేసే వాదనల్లో ఎలాంటి పస లేదని తాము నమ్ముతున్నప్పటికీ శిక్షను వాయిదా వేయాలంటూ తీసుకున్న చర్యను తాము తోసిపుచ్చలేమని మన్‌హటన్ జిల్లా అటార్నీ కార్యాలయం ప్రాసిక్యూటర్లు తెలిపారు.

నిద్ర ముంచుకొచ్చింది అందుకే తడబడ్డాను : బైడెన్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఉన్న జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఇటీవల జరిగిన ప్రత్యక్ష చర్చ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఈ చర్చ సమయంలో బైడెన్ పలుమార్లు తడబాటుకు గురయ్యారు. ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉన్న సమయంలో ఇలా జరగడం బైడెన్ పార్టీ డెమొక్రాటిక్‌లోనే ఆందోళనలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో తాను తడబాటుకు గురైనట్లు స్వయంగా బైడెన్ అంగీకరించారు. అలాగే, అందుకుగల కారణాన్ని వెల్లడించారు. తన సిబ్బంది ఎంత వారించినా చర్చకు ముందు తాను పలు విదేశీ పర్యటనలకు వెళ్లానని బైడెన్ తెలిపారు. దాని వల్ల వచ్చిన అలసట కారణంగానే వేదికపై దాదాపు నిద్రపోయినంత పనైందని పేర్కొన్నారు. అందుకే సంవాదంలో సరిగా వాదించలేకపోయినట్లు వెల్లడించారు. తాను మరింత చురుగ్గా వ్యవహరించాల్సిందని తెలిపారు. అందుకు తనను క్షమించాలని పార్టీ మద్దతుదారులను కోరారు. దీన్ని సాకుగా భావించొద్దని.. కేవలం వివరణగా మాత్రమే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్జీనియాలో విరాళాల సేకరణ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

టోరీలను భయపెడుతున్న ఓటమి!

- నేడు బ్రిటన్ ఎన్నికలు

లండన్: బ్రిటన్ పార్లమెంటు ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అధికార టోరీలు (కన్సర్వేటివ్ పార్టీ)ఓటమి ఖాయమని పలు సర్వేలు ఘోషిస్తున్న నేపథ్యంలో రిషి సునాక్ భవితవ్యం కూడా ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటన్‌కు చెందిన అగ్రశ్రేణి ఎన్నికల నిపుణుడు సర్ జాన్ కర్టిస్ మీడియాతో మాట్లాడుతూ, దేశ రాజధాని లండన్‌లో టోరీలకు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదని ఢంకా బజాయించారు. యార్క్ షైర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సునాక్ ఆ సీటును నిలబెట్టుకోవడం కూడా కష్టమేనని ఆయన తెలిపారు. గత సారి ఈ నియోజకవర్గం నుంచి సునాక్ 27వేల మెజార్టీతో ఆయన గెలుపొందారు. ప్రస్తుతం టోరీలకు 19 శాతం మంది మద్దతు మాత్రమే ఉందని, మరో వైపు లేబర్ పార్టీకి మద్దతు 49 శాతం దాకా ఉందని తాజా సర్వేలు వెల్లడించాయి. లేబర్ పార్టీ నేత కీర్ స్టార్మర్ తన పార్టీలో లెఫ్ట్ అనుకూలవాదులను అణచివేయడం, పార్టీ నుంచి బహిష్కరించడం వంటి చర్యలను,. ఇస్లింగ్టన్ నుంచి ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగిన లేబర్ పార్టీ మాజీ నేత, వామపక్షవాది జెరిమి కార్బిన విమర్శించారు.

తొమ్మిది నెలల్లో గాజాలో 6050మంది విద్యార్థులు మృతి

- 10వేల మందికి పైగా గాయాలు

గాజా : గాజాలో గత 9మాసాలుగా ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 6050మంది విద్యార్థులు చనిపోయారని పాలస్తీనా విద్యా శాఖ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. 10,219 మంది గాయపడ్డారు. గాజాలో 5,994మంది మరణించగా, 9890మంది గాయపడ్డారని, వెస్ట్ బ్యాంక్‌లో 56మంది విద్యార్థులు చనిపోగా, 329మంది గాయపడ్డారని, 105మందిని నిర్బంధించారని పాలస్తీనా ఇన్ఫర్మేషన్ సెంటర్ తెలిపింది. కాగా ఇప్పటివరకు గాజాలో 266 మంది టీచర్లు, స్కూల్ అడ్మినిస్ట్రేటర్లు చనిపోగా, 973మంది గాయపడ్డారని వెల్లడించింది. గాజావ్యాప్తంగా 351 ప్రభుత్వ స్కూళ్ళు, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నడిచే 65 పాఠశాలలు బాంబు దాడులకు గురై ధ్వంసమయ్యాయని విద్యా శాఖ వర్గాలు వెల్లడించాయి. వీటిలో 111 భవనాలు తీవ్రంగా దెబ్బతినగా, 40 భవనాలు పూర్తిగా నేలమట్టమై పోయాయి. గాజాలో కొనసాగుతున్న ఈ దాడుల కారణంగా 6,20,000మందికి పైగా విద్యార్థులకు విద్య దూరమైందని పేర్కొంది. విద్యార్థుల్లో చాలామంది మానసిక అస్వస్థతలకు గురయ్యారని, దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొంది. ఇప్పటివరకు గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో 37,916మంది మరణించగా, 75,494మంది గాయపడ్డారు. వీరిలో 72శాతానికి పైగా బాధితులు మహిళలు, పిల్లలే.



ప్రత్యేక ప్యాకేజీతోనే ఎపి అభివృద్ధి

- కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రత్యేక ప్యాకేజీతోనే ఆంధ్రప్రదేశ్‌కు అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాకు బదులుగానే ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చాం కదా అని పేర్కొన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనేది తీర్మానాలు చేసినంత మాత్రాన ఇచ్చే అంశం కాదని అన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీతోనే అభివృద్ధికి కేంద్రం సహాయపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ వైఫల్యం వల్లే డయాఫ్రం వాల్, కాపర్ డ్యాంకు పగుళ్లు వచ్చాయన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని అన్నారు. కానీ ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందా? లేదంటే కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుందా? అనేది కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.



కార్యకర్తలకు అండగా నిలవండి

- వైసిపి నేతలతో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక వైసిపి కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని, వారికి అండగా వుండాలని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నంద్యాలకు చెందిన వైసిపి ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మాజీ మంత్రి ఆళ్ల నాని, మాజీ ఎమ్మెల్యేలు కె సంజీవయ్య, ప్రసన్నకుమార్‌రెడ్డి, నాయకులు చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, బి శేషారెడ్డి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారికి జగన్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 40 శాతం మంది ప్రజలు మనవెంట వున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని అన్నారు. పార్టీ శ్రేణులంతా ప్రజలకు అందుబాటులో వుండాలని సూచించారు.

పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రి కమిటీల సభ్యులుగా కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, జి. కిషన్ రెడ్డికి అవకాశం దక్కింది. పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీల్లో సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు నియామకం అయ్యారు. రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా కిషన్ రెడ్డికి చోటు దక్కింది. ఇక అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా ఉన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో వేర్వేరు కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్యాబినెట్ కమిటీ ఆన్ అకామిడేషన్, క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ పార్లమెంటరీ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ పొలిటికల్ ఎఫైర్స్, క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ, క్యాబినెట్ కమిటీ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ గ్రోత్, క్యాబినెట్ కమిటీ ఆన్ స్కిల్, ఎంప్లాయిమెంట్ అండ్ లైవ్లీహుడ్ కమిటీలను కేంద్రం ఏర్పాటు చేసింది.

కాంగ్రెస్ గూటికి కె.కేశవరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



బిఆర్ఎస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో కె.కేశవరావుకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, తెలంగాణ ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కేశవరావును సొంతింటికి చేరారని, ఆయన కాంగ్రెస్‌లోకి స్వాగతిస్తున్నామని ఖర్గే అన్నారు. ప్రజాసేవలో ఆయనకున్న అపార అనుభవం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తుందన్న నమ్మకం తమకుందని అన్నారు. కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

టిపిసిసి అధ్యక్ష నియామకం వాయిదా

తెలంగాణ నూతన పిసిసి అధ్యక్షుడి నియామకం తాత్కాలికంగా వాయిదా పడింది. కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకకపోవడంతో ఎంపిక ప్రక్రియను ఎఐసిసి వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ విషయమై వారం రోజుల్లో మరోసారి చర్చించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. పిసిసి అధ్యక్ష పదవి కోసం ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్, ఎంపిలు బలరాం నాయక్, సురేష్ షెట్కర్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీతక్కలు సైతం అధ్యక్ష పదవిని అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పిసిసి అధ్యక్షుడి నియామకం తరువాతే మంత్రి వర్గ విస్తరణ ఉండొచ్చని సమాచారం.

రాజ్యసభలోనూ మోడీ అదే పాట

(మొదటి పేజీ తరువాయి)

సభకు వెల్లడించినందుకు నిరసనగా తాము వాకౌట్ చేశామని తెలిపారు. అసత్యాలు పలకడం మోడీకి అలవాటని, సత్యదూరమైన అంశాలను ప్రస్తావిస్తుంటారని విమర్శించారు. రాజ్యాంగం కోసం పాటుపడేది ఎవరు, దాన్ని వ్యతిరేకించేది ఎవరనేది స్పష్టం చేశానని తెలిపారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తుందని, వారు బిఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారని, అయితే మరోవైపు అంబేద్కర్‌ను కాంగ్రెస్ అగౌరవపరుస్తుందని మోడీ పదేపదే చెబుతుంటారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ సభలో బాబా సాహెబ్ ఏం చెప్పారో, ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ ఏం రాసిందో చెప్పాలని తాను డిమాండ్ చేశానని ఖర్గే తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని, విద్యార్థులకు అన్యాయాలపై తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఎన్‌టిఎను రద్దు చేయాలనే డిమాండ్‌ను ఎస్ఎఫ్ఐ వీధుల్లో ఉధృతం చేస్తూనే ఉంటుందని అన్నారు. ఈ ఉద్యమం వృథా కాకూడదనే కృతనిశ్చయంతో ఉన్నామని, సంఘపరివార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో విద్యార్థులు చేస్తున్న పోరాటం ఇది అని స్పష్టం చేశారు. నేడు (గురువారం) ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జెఎన్‌యుఎస్‌యు మాజీ అధ్యక్షురాలు ఐషీఘోష్ మాట్లాడుతూ "యుజిసి, కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌టిఎ దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో పదే పదే ఆడుకుంటుంది. 2017లో ఎన్‌టిఎ ప్రవేశపెట్టడంతో విద్యా కేంద్రీకరణ ఎజెండాను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించింది. అది పూర్తిగా విఫలమైనదని స్పష్టం అయిన తరువాత కూడా దానిని తొలగించడానికి వారు ఎందుకు వెనుకాడుతున్నారు?" అని ప్రశ్నించారు.

పార్లమెంట్ గళం విప్పుతాం : అమ్రారామ్

విద్యార్థుల ఆందోళన సంఘీభావం తెలిపిన సిపిఎం లోక్‌సభ ఎంపి అమ్రా రామ్ మాట్లాడుతూ "పేపర్ లీక్‌లు, పరీక్షల నిర్వహణలో అసమర్థత, అవకాశాల లేమి, వ్యవస్థలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ఎఎన్‌టి, ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోంది. విద్యార్థులు చెప్పేది వినాలని, పార్లమెంట్‌లో నీట్‌పై చర్చలు ఆపాలని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. విద్యార్థులకు అందాల్సిన న్యాయం జరిగేలా, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఎన్‌టిఎను రద్దు చేసేందుకు పార్లమెంట్ లోపలా, బయటా గళం విప్పుతాం" అని తెలిపారు.





మీకోసం

బంగాళాదుంపలను శుభ్రంగా కడిగి ఆరాక, నూనె రాసి ఉంచితే మొలకలు రావు, చాలా రోజులు తాజాగా ఉంటాయి.

జీవన సౌరభం

మన ప్రవర్తనే మన స్థాయిని నిర్ణయిస్తుంది. అంతే తప్ప, ఎదుటి వారి పొగడ్తలు కావు.

JEEVANA జీవన the family

బాలల గ్రంథాలయాలు



పుస్తకాల భాండాగారాలు
జ్ఞానామృతాన్ని పంచే చైతన్య స్రవంతులు
పుస్తక పఠనానికి నిలయాలు
చిన్నారుల ప్రగతికి వారధులు!


పిల్లల కథలు, కవితలు, బొమ్మలు
చందమామ, పంచతంత్రాల నీతి కథలు
రకరకాల బాల సాహిత్య పుస్తకాలు
అందించే పెన్నిధులు గ్రంథాలయాలు!

బాల్యంలో పుస్తక పఠనం
వికసింపచేస్తుంది మనోవికాసం
కలిగిస్తుంది విషయ పరిజ్ఞానం
పెంపొందిస్తుంది మేధా సామర్థ్యం!

బడి పుస్తకాలు పాఠాలకే పరిమితం
గ్రంథాలయ అంశాలు అపరిమితం
భిన్న పుస్తకాల పఠనం పిల్లల అభిమతం
అది గ్రంథాలయాల్లోనే సాధ్యం!

అందుకే
బాలలు తరచూ గ్రంథాలయాలకు వెళ్ళాలి
నచ్చిన పుస్తకం ఎంచుకొని
ఇష్టంగా చదవాలి
చక్కంగా జ్ఞానం పెంచుకొని
ఉన్నతంగా ఎదగాలి!

- పి.వి.ప్రసాద్,
94401 76824.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



మొరుకుర్తి లక్ష్మీప్రసన్న,
5వ తరగతి,
మం.ప్ర.ప.ప్రాథమిక పాఠశాల,
జె.తిమ్మాపురం, పెద్దాపురం మండలం,
కాకినాడ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వానల వేళ.. కరెంటుతో జాగ్రత్త!


వర్షాకాలంలో కాలు బయట పెట్టాలంటే అప్రమత్తంగా ఉండాలి. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే వాన నీటిలో ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలీదు. వర్షంతోపాటు గాలి కూడా వీస్తే విద్యుత్ స్తంభాలు విరిగిపోవటం, వాలిపోవడం జరుగుతుంటాయి. వాన నీటితో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుంటాయి. ఆ సమయంలో వాటిని తాకితే ప్రమాదం సంభవిస్తుంది. ఈదురు గాలులతో కరెంట్ తీగలు తెగిపోతుంటాయి. ఇన్ని ప్రమాదాలు ఉన్నందున వర్షాకాలంలో విద్యుత్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఇవి గమనించాలి!

- ఇంటి గోడలు తడిగా మారితే స్విచ్‌బోర్డు నుంచి విద్యుత్ గోడలకూ విస్తరించొచ్చు.
- ఇంట్లో ఎర్తింగ్ వేయకపోతే షాక్ తగులుతుంది.
- తడి చేతులతో విద్యుత్ తీగలు, ఉపకరణాలను తాకకూడదు. ప్లగ్ లేదా స్విచ్‌బోర్డులో నీరు ఉన్నా షాక్ కొడుతుంది.
- విద్యుత్ స్తంభం సపోర్టింగ్ వైర్లలోకి ఒక్కోసారి విద్యుత్ ప్రసారం జరగొచ్చు. కాబట్టి, వాటికి దూరంగా ఉండాలి.
- ప్రతి సందర్భంలోనూ యథాలాపంగా ఉండకుండా నిత్యం గమనింపుతో ఉండాలి. వైర్లు ఎలా ఉన్నాయో చూసుకోవాలి.

కొన్ని జాగ్రత్తలు

- వర్షాకాలంలో ముందుగా ఇంట్లో ఉన్న అన్ని స్విచ్‌బోర్డులు, వైర్లను పరీక్షించాలి. ఎక్కడైనా వైరు తెరచివుంటే దాన్ని మూసివేయాలి.
- చేతులను ఎల్లప్పుడూ పొడిగా ఉంచుకోవాలి. పొడి బూట్లు, చెప్పులు ధరించాలి.
- విద్యుత్ మీటరు నుంచి ఇంటికి వచ్చే కేబుల్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి.
- ఇంట్లో ఎర్తింగ్ సమస్య ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలి



- విద్యుత్ వైర్ల కింద ఇళ్లను నిర్మించరాదు. మేడ పై నుంచి, ఇంటి పక్క నుంచి కరెంటు వైర్లు వెళుతుంటే వాటికి ఏవీ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి.
- విద్యుత్ ల బట్టలు ఆరబెట్టడానికి ఇనుప తీగలు కట్టొద్దు. విద్యుత్ తీగలకు దగ్గరగా ఇనుప చువ్వలు తీసుకెళ్లరాదు.
- ఐఎస్ఐ మార్కు ఉన్న వైరు, సామానుతోనే హౌస్‌వైరింగ్ చేయించాలి.
- అగ్నిప్రమాదం జరిగిన వెంటనే మెయిన్స్ ఆఫ్ చేయాలి.
- విద్యుత్ ప్రవాహానికి మంటలు అంటుకుంటే దానిపై నీళ్ల చల్లే ప్రయత్నం చేయరాదు.
- ఎవరికైనా కరెంట్ షాక్ తగిలితే వారిని తాకొద్దు. కర్ర సహాయంతో వారిని దూరంగా జరపాలి.
- ఒట్టి చేతలతో, చెప్పులు లేకుండా పవర్ టూల్స్ ఉపయోగించొద్దు.

ప్రమాదాలు జరక్కుండా ...

- వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడకూడదు. వీలైనంతవరకూ విద్యుత్‌వైర్లకు దూరంగా ఉండాలి.
- ఎక్కడైనా విద్యుత్ తీగలు కిందకు వంగినట్లుగానీ, రోడ్డుపై పడినట్లుగానీ కనిపిస్తే వాటి వద్దకు వెళ్లకూడదు. ఎవ్వరినీ వెళ్లనీయకూడదు.
- వీలైనంతవరకు విద్యుత్ వైర్లకు, స్టే వైర్లకు, ట్రాన్సఫార్మర్లకు, ఇతర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి.
- పశువులు, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలి.
- రోడ్డు మీదగానీ, నీటిలోని కానీ విద్యుత్ తీగ పడి ఉన్నట్లుగా గుర్తిస్తే వాటిని తొక్కకూడదు. వాటి మీద నుంచి వాహనాలు నడపకూడదు. వెంటనే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి, సరిచేయించాలి.
- చెట్ల కొమ్మలపై, వాహనాలపై, భవనాలపై తెగి పడ్డ తీగలు ఉన్నట్లయితే వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- గాలి, వాన సమయంలో విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు ఉన్నట్లయితే విద్యుత్ పరికరాలను ఆఫ్ చేసుకోవాలి.
- ఉరుములు, మెరుపులు వచ్చిన సమయంలో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద గానీ, సెల్ టవర్ల వద్దగానీ, చెట్ల కింద గానీ నిలబడవద్దు.
- తడిచిన విద్యుత్ స్తంభాలను, గోడలను తాకరాదు. వాటికి విద్యుత్ ప్రసరణ జరిగితే షాక్ కొట్టే ప్రమాదం ఉంది.
- ఇంటి పై కప్పుగా వేసిన ఇనుప రేకులను తాకరాదు.
- వ్యవసాయ బావులు, బోర్లు వద్ద, కరెంట్ పెట్టే ముందు తడిచిన స్టార్టర్ బాక్సులు, ఫ్యూజ్ బాక్సులను చేతులతో ముట్టుకోవద్దు.

చర్మ సంరక్షణ.. కొన్ని జాగ్రత్తలు..

వర్షాకాలంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు చాలా ఇబ్బంది పెడుతుంటాయి. ఒకసారి వచ్చాయంటే ఓ పట్టాన వదిలిపోవు. వచ్చాక జాగ్రత్తలు తీసుకోవడం కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యం. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ఈ చిట్కాలు పాటించాలి.

వ్యక్తిగత పరిశుభ్రత

క్రమం తప్పకుండా స్నానం చేయాలి. తరచుగా చేతులు కడుక్కోవాలి. ప్రతిరోజూ ఉతికిన బట్టలే వేసుకోవాలి. పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. బూట్లకు బదులుగా చెప్పులు లేదా ఓపెన్-టోడ్ బూట్లు ధరించడం మేలు. అలాగే గోళ్లను చిన్నగా, శుభ్రంగా కత్తిరించుకోవాలి.

వస్త్రధారణ ఇలా ...

వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. స్పాండెక్స్ లేదా నైలాన్ వంటి సింథటిక్ ఫ్యాబ్రిక్‌లను ధరించకూడదు. ఈ బట్టలు శరీరానికి గాలిని తగలనివ్వవు. శరీరంపై వేడి, తేమను పట్టి ఉంచుతాయి. కాబట్టి వదులైన దుస్తులే వేసుకోవాలి.

పరిసరాలు పొడిగా ఉంచాలి..

ఫంగల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే చుట్టూ ఉన్న వాతావరణాన్ని పొడిగా ఉంచాలి. నివాస స్థలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అలాగే గాలిలో తేమను తగ్గించడానికి, శిలీంధ్రాల పెరుగుదలను అరికట్టడానికి ఇంటిలోని అన్ని ప్రాంతాలకు ధారాళంగా గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోండి.

ప్రత్యేక టవల్ ఉపయోగించాలి


తువ్వాలు లేదా దుస్తులు వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవద్దు. ఇప్పటికే ఫంగల్ ఇన్ఫెక్షన్ సంకేతాలను చూపుతున్నట్లయితే ఇంకా జాగ్రత్త పడాలి. అలాగే లాకర్ రూమ్‌లు లేదా పబ్లిక్ పూల్స్ వంటి బహిరంగ ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవకూడదు. ఎందుకంటే ఈ ప్రదేశాల్లో తరచుగా తేమ ఎక్కువగా ఉంటుంది, ఇది శిలీంధ్రాల సంతానోత్పత్తికి కారణమవుతుంది.



తగిన చికిత్స తీసుకోవాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫంగల్ ఇన్ఫెక్షన్‌కు గురైతే.. తగిన చికిత్స తీసుకోవడం ముఖ్యం. తేలికపాటి ఫంగల్ ఇన్ఫెక్షన్‌లకు చికిత్స చేయడానికి ఓవర్-ది-కౌంటర్ యాంటీ ఫంగల్ క్రీమ్‌లు లేదా స్ప్రేలను ఉపయోగించవచ్చు. తీవ్రమైన ఇన్ఫెక్షన్ బారిన పడితే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి.

ఆగస్టు 2న 'ఆపరేషన్ రావణ్'



రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న కొత్త సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను బుధవారం మేకర్స్ ప్రకటించారు. ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు తెలిపారు.

మోక్షజ్ఞ ఎంట్రీకి రంగం సిద్ధం



నందమూరి కుటుంబం నుంచి మరో హీరో రాబోతున్నారు. ఆయనే బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ. తండ్రి బాలకృష్ణ నిర్మాతగా మొదటి సినిమా వస్తుందనే ఊహాగానాలు వస్తున్నాయి. ఇప్పటికే పలువురు యువ దర్శకులు బాలయ్యను కలిసి తాము సిద్ధం చేసిన కథల గురించి వివరించారని కూడా సమాచారం. అయితే ప్రశాంత్‌వర్మ సిద్ధం చేసిన కథకు సానుకూలంగా ఉన్నట్లుగా తెలిసింది. సెప్టెంబర్ 6న మోక్షజ్ఞ పుట్టిన రోజు కావటంతో ఆ రోజు సినిమా ఎంట్రీ గురించిన ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ మోక్షజ్ఞ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. స్టైలిష్ లుక్ ఫొటో షూట్‌లతో అప్‌డేట్‌లో ఉంటున్నాడు. 'వస్తున్నా.. మీ అందరి ఆశీస్సులు కావాలి' అంటూ తన ఎక్స్‌ఖాతాలో ఈ మధ్య రాశాడు.

రొటీన్‌కు భిన్నంగా... : అఫ్జల్



'రొటీన్ కథలకు భిన్నంగా సరికొత్త కథతో మేము ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా '1000 వాలా' సినిమా తీశాం. ఒక సంకల్పంతో ఒక సాధన కోసం పల్లెటూరి యువకుడు పట్టణం వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఎదురయ్యే అన్ని రకాల సమస్యలు పట్టి చూపించాం. మాస్, క్లాస్ ఎలిమెంట్లతోపాటుగా లవ్‌లీ కామెడీ మంచి ఎంటర్‌టైనర్‌గా సాగుతుంది. సగటు సామాన్య యువకుడు తాను ఎదుర్కొనే సమస్యలను ఎలా పరిష్కరించగలిగాడు' అనే ఇతివృత్తంతో సినిమా సాగుతుంది. ఈ సినిమాలో నాలుగు పాటలున్నాయి. మంచి లొకేషన్లలో సరికొత్త హంగులతో చిత్రీకరించాం.' అని దర్శకుడు అఫ్జల్ తెలిపారు. షారుఖ్ నిర్మాణంలో హీరోగా అమిత్ నటిస్తున్న చిత్రం ఇది. షారుఖ్, నవిత, కీర్తి, సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

'లైలా'గా విశ్వక్‌సేన్



విశ్వక్ సేన్ నటిస్తున్న 'లైలా' సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఈ చిత్రంలో విశ్వక్ సేన్ లైలా లుక్‌ను రివీల్ చేశారు. ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహూ గారపాటి నిర్మిస్తున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయికగా నటిస్తున్నారు. జిబ్రాన్, బాలీవుడ్ ఫేమస్ తనిష్క్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను 2025 ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

విజయ్ చివరి సినిమాలో సమంత



తమిళ నటుడు విజయ్ తన చివరి చిత్రంలో నటించనున్న కథానాయిక ఎవరనేది ఆసక్తిగా మారింది. రాజకీయ పార్టీని ప్రారంభించిన విజయ్ ప్రస్తుతం గోట్ చిత్రాన్ని పూర్తి చేశారు. వెంకటప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీనిని నిర్మించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. 69వ చిత్రం ఆఖరిదిగా చెబుతున్నారు. దీనికి హెచ్.వినోద్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహించనున్నారు. విజయ్ రాజకీయ కెరీర్‌గా ఉపయోగపడేలా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని సమాచారం. మొదట్లో నయనతార, శ్రీలీల పేర్లు తెరమీదకు వచ్చినా టాలీవుడ్ నటి సమంత పేరు ఫైనల్ చేసినట్లుగా తెలిసింది. అక్టోబర్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు సమాచారం.

'35- చిన్న కథ కాదు' ఫస్ట్ లుక్, టీజర్ విడుదల



నివేదా థామస్ ప్రధాన పాత్రలో రానా దగ్గుబాటి సమర్పణలో '35 - చిన్న కథ కాదు' అనే సినిమాను డైరెక్టర్ నంద కిషోర్ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అయ్యింది. తాజాగా ఇక ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇదో, మా సిన్న కుటుంబం తొలి సూపు' అంటూ ఈ మూవీలోని మెయిన్ క్యాస్టింగ్ ఉన్న పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో నివేదా థామస్ ఓ మధ్య తరగతి గృహిణి పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ కూడా బుధవారం రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ప్రియదర్శి, విశ్వ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదల కానుంది.

2025 ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల

- **మార్చి 1న భారత్-పాక్ మ్యాచ్**
- **ఐసిసి ఆమోదానికి డ్రాఫ్ట్ కాపీ**



ముంబయి: వచ్చే ఏడాది (2025)లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఎనిమిది దేశాలు పాల్గొనే ఈ మెగా టోర్నీ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు మొత్తం 15 మ్యాచ్‌లు నిర్వహించాలనుకుంటోంది. ఈ మేరకు డ్రాఫ్ట్ షెడ్యూల్‌ని పీసీబీ.. ఐసీసీకి అందజేసింది. దీని ప్రకారం చిరకాల ప్రత్యర్థులైన భారత్-పాక్ మ్యాచ్ మార్చి 1న లాహోర్‌లో జరగనుంది. అయితే, ఈ డ్రాఫ్ట్ షెడ్యూల్‌కు బీసీసీఐ ఇంకా సమ్మతి తెలపలేదని ఐసీసీ సీనియర్ సభ్యుడు ఒకరు తెలిపారు. ఏడు మ్యాచ్‌లు లాహోర్‌లో, మూడు మ్యాచ్‌లు కరాచీలో, ఐదు మ్యాచ్‌లను రావల్పిండిలో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. కరాచీ, రావల్పిండి రెండు సెమీ ఫైనల్స్, లాహోర్ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. భద్రతాపరమైన, రవాణా కారణాల దృష్ట్యా భారత్ మ్యాచ్‌లన్నింటినీ లాహోర్‌లోని గడాఫీ స్టేడియంకు పరిమితం చేశారు. భారత్ సెమీ ఫైనల్‌కు క్వాలిఫై అయితే ఆ మ్యాచ్ కూడా అక్కడే నిర్వహిస్తారు. గ్రూప్ ఎలో భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్.. గ్రూప్ బిలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, అఫ్గానిస్థాన్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఆటగాళ్ల భద్రత, ఇతర కారణాల వల్ల టీమ్‌ఇండియా చాలాకాలంగా పాక్ పర్యటనకు వెళ్లడం లేదు. భారత జట్టు చివరిసారిగా 2008 ఆసియా కప్ కోసం అక్కడికి వెళ్లింది. గతేడాది ఆసియా కప్ మ్యాచ్‌లను కూడా హైబ్రిడ్ విధానంలో నిర్వహించారు.

పాకిస్థాన్‌లో 4 మ్యాచ్‌లు, మిగతా 9 మ్యాచ్‌లు శ్రీలంకలో ఆడేలా షెడ్యూల్ రూపొందించారు. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్‌లో టీమ్‌ఇండియా పర్యటిస్తుందా లేదా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తేనే టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీకి వెళ్తుంది.

సంబరాలకు సిద్ధం

నేడు ముంబయిలో ఓపెన్ బస్ పరేడ్
తొలుత ప్రధానిని కలవనున్న టి20 ఛాంపియన్స్

ముంబయి: టి20 ప్రపంచ కప్ సాధించిన టీమిండియా ఆటగాళ్లు ముంబయిలో మెరైన్ డ్రైవ్ ప్రాంతంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు బిసిసిఐ కార్యదర్శి జే షా ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు. గురువారం సాయంత్రం 5గంటలకు ఈ సంబరాలు మొదలవుతాయని తెలుపుతూ అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ధోనీ సారథ్యంలో భారత్ 2007 టి20 ప్రపంచ కప్ సాధించినప్పుడు కూడా ముంబయిలో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఆ సందర్భంగా వేలాది అభిమానులు టీమిండియా ఆటగాళ్లున్న బస్సు వెంట నడిచి గెలుపు సంబరాల్లో భాగస్వాములయ్యారు. తాజాగా అప్పటి ఫొటోను బిసిసిఐ కార్యదర్శి జే షా సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అభిమానులు భారీ సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. టీమిండియా ఆటగాళ్ల కోసం బిసిసిఐ ప్రత్యేక విమానంలో బార్బడోస్ నుంచి స్వదేశానికి తిరిగి రానున్నారు. ఈ విమానం గురువారం ఉదయం న్యూఢిల్లీకి చేరనుంది. ఆ తర్వాత భారత ఆటగాళ్లు ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తారు. అనంతరం భారత ప్రపంచ కప్ జట్టు ముంబయికి చేరుకుని విజయోత్సవ సంబరాల్లో పాల్గొంటుంది.

టర్కీ సంచలనం

ఆస్ట్రియాపై 2-1గోల్స్‌తో గెలుపు

బెర్లిన్: యూరో-2024లో టర్కీ జట్టు సంచలనం నమోదు చేసింది. బుధవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో పటిష్ట ఆస్ట్రియా జట్టును ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో టర్కీ 2-1గోల్స్ తేడాతో ఆస్ట్రియాను చిత్తుచేసింది. టర్కీ తరఫున మెర్త్ దెర్మినల్ మ్యాచ్ ప్రారంభమైన తొలి నిమిషంలోనే గోల్ కొట్టి ఆస్ట్రియాను షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత 59వ ని.లో మరో గోల్ కొట్టడంతో టర్కీ 2-0 ఆధిక్యతలోకి వెళ్లింది. ఆస్ట్రియా తరఫున ఏకైక గోల్‌ను మిఛెల్(66వ ని.)లో చేశాడు. 7న జరిగే క్వార్టర్స్‌కు టర్కీ జట్టు నెదర్లాండ్స్‌తో తలపడనుంది. మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 3-0గోల్స్ తేడాతో రొమేనియాను చిత్తుచేసింది.

మూడో రౌండ్‌కు గాఫ్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో అమెరికా యువ సంచలనం కోకా గాఫ్ హవా కొనసాగుతోంది. 2వ సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్.. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో వరుససెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. తొలిరౌండ్‌లో గాఫ్ 6-2, 6-1తో టొడోని(ఫ్రాన్స్)పై సునాయాసంగా నెగ్గింది. ఇతర పోటీలో 20వ సీడ్ హడ్డాడ్ మాయా(బ్రెజిల్) 7-5, 6-3తో ఫ్రెచ్(పోలండ్)ను ఓడించింది.

రూడ్ ఔట్..

పురుషుల సింగిల్స్‌లో పెను సంచలనం నమోదైంది. 8వ సీడ్, నార్వేకు చెందిన కాస్పర్ రూఢ్ అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో రూఢ్ 4-6, 5-7, 7-6(7-1), 3-6తో ఫోగ్నిని(ఇటలీ) చేతిలో పోరాడి ఓడాడు.

డబుల్స్‌లోనూ సుమిత్‌కు నిరాశ..

పురుషుల సింగిల్స్‌లో తొలిరౌండ్‌లోనే ఓడిన సుమిత్ నాగల్‌కు పురుషుల డబుల్స్‌లోనూ నిరాశ తప్పలేదు. బుధవారం జరిగిన డబుల్స్ తొలిరౌండ్ పోటీలో నాగల్-లాజొవిక్(క్రొయేషియా) జోడీ 2-6, 2-6తో స్పెయిన్ జోడీ చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది.

కోస్టల్ రైడర్స్ విజయం



రషీద్
67పరుగులు

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

ఆంధ్ర ప్రిమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 3లో బుధవారం బెజవాడ టైగర్స్ జట్టుపై ఎనిమిది పరుగుల తేడాతో కోస్టల్ రైడర్స్ విజయం సాధించింది. పిఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బెజవాడ టైగర్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 170 పరుగులు చేసింది. ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్లు కెప్టెన్ షేక్ రషీద్ 47 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 67 పరుగులు, అభిషేక్ రెడ్డి 22 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35 పరుగులు చేశారు. కార్తీక్ రామన్ 9 బంతుల్లో 19 పరుగులు చేసి రాణించాడు. మొత్తంగా 170 పరుగుల స్కోరును బెజవాడ టైగర్స్ ముందు నిలిపారు. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 162 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎనిమిది పరుగుల తేడాతో ఓటమి చెందింది. ఓపెనర్లు ధ్రువకుమార్ రెడ్డి, కెప్టెన్ రిక్కీ బుయి, పైలా అవినాష్ రాణించినప్పటికీ వరుసగా వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు ఓటమిపాలైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68